ప్రజాశక్తి

ఆదివారం 26 అక్టోబర్ 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

రారెత్తిస్తున్న టమాటా



రైతు బజారులో సాగుతున్న టమాటా విక్రయాలు

- మూడు రోజుల్లో కిలోపై రూ.17 పెరుగుదల
- రైతు బజార్లలో రూ.38, బయట మార్కెట్లో రూ.50 వరకూ అమ్మకాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

టమాటా ధరలు రారెత్తిస్తున్నాయి. విశాఖ నగరంలో మూడు రోజుల్లో కిలో ధర అమాంతం రూ.17 పెరిగింది. బుధవారం కిలో రూ.21 ఉన్న టమాటా ధర గురువారానికి ఏకంగా రూ.36కు ఎగబాకింది. శనివారం మరింత పెరిగి రూ.38 ధరకు కూడా రైతు బజార్లలో దొరకని పరిస్థితి ఎదురైంది. బయటి మార్కెట్లో కిలో రూ.45 నుంచి రూ.50 ధరకు అమ్ముతున్నారు.

కొంతకాలంగా ప్రభుత్వం సరఫరా చేస్తున్న టమాటాను విక్రయిస్తున్న రైతుబజార్లకు శుక్రవారం సరుకు రాకపోవడంతో ధర అమాంతం పెరిగిపోయింది. హోల్ సేల్ మార్కెట్లో కేటు ధర రూ.1800 వరకు నిర్ణయించినట్లు తెలిసింది. నగరంలో ఉన్న రైతు బజార్లకు హోల్‌సేల్ వర్తకులు ప్రభుత్వ ధరకు సరఫరా చేయలేమని చేతులెత్తేశారు. కనీసం రూ.40 కిలో ధర ఇస్తేగానీ టమాటా సరఫరా చేసేది లేదని భీష్మించుకొని కూర్చున్నట్లు సమాచారం. ప్రభుత్వ టమాటా వస్తుందన్న ఉద్దేశంతో హోల్ సేల్ వర్తకులు కూడా తగినన్ని టమాటా లారీలను తెప్పించకపోవడంతో టమాటా కొరత ఏర్పడింది. ఇదిలా ఉండగా కృత్రిమ కొరత సృష్టించారని పలువురు ఆరోపిస్తున్నారు.

హోల్‌సేల్ వర్తకులు ఏమంటున్నారు ?

భారీ వర్షాల కారణంగా టమాటా నగరానికి తక్కువ మొత్తంలో వస్తోందని, నాలుగు కేట్‌లలో టమాటా వస్తే వాటిలోని ఒక కేట్ టమాటా వర్షాల వల్ల పాడైపోతోందని హోల్‌సేల్ వ్యాపారి దాడి రామకృష్ణ తెలిపారు. తమకు నష్టాలు తప్పడం లేదన్నారు. మరికొందరూ అదే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఉల్లిపాయలు, టమాటాల విషయంలో నిర్దిష్టమైన ప్రణాళికలతో అధికారులు ఉండకపోతే రేట్లు అమాంతం పెరుగుతాయని, ధరలకు కళ్లెం వేయలేమని పలువురు చెబుతున్నారు.



రామ్‌నగర్ ఏరియాలో ప్రైవేటు ట్రావెల్స్ రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

కర్నూలు ఘటనతో కదిలారు !

- ప్రైవేటు ట్రావెల్ బస్సుల్లో విస్తృత తనిఖీలు
- మూడు బస్సులు సీజ్

ప్రజాశక్తి - ఆనందపురం, మధురవాడ, ఎంవిపి.కాలనీ

కర్నూలు బస్సు ప్రమాద ఘటనతో పోలీసు, రవాణా శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. నిబంధనలు ఉల్లంఘించిన బస్సులపై శనివారం విశాఖలో కొరడా ఝుళిపించారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.రాజారావు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎ.వరప్రసాద్, జి.సత్యనారాయణలతోపాటు ట్రాఫిక్ పోలీసులతో కూడిన బృందాలు పిఎం.పాలెం, ఎంవిపి.కాలనీ పరిసర ప్రాంతాల్లో ప్రయివేటు ట్రావెల్ బస్సుల్లో విస్తృత తనిఖీలు నిర్వహించాయి. ఈ సందర్భంగా అధికారులు రికార్డులు పరిశీలించారు. నిబంధనల ఉల్లంఘనను గుర్తించారు. సీటర్ బస్సులుగా రికార్డుల్లో ఉండగా స్లీపర్స్‌తో ఉన్న మూడు బస్సులను పిఎం.పాలెం వద్ద సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎంఇఐ రాజారావు తెలిపారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా తనిఖీలు కొనసాగిస్తామని వెల్లడించారు. మరోవైపు పిఎం.పాలెం పోలీసులూ అప్రమత్తమయ్యారు. శనివారం ట్రాఫిక్ సిఐ నల్లి సాయి ఆధ్వర్యంలో టూరిస్ట్ బస్సుల్లో తనిఖీలు చేపట్టారు. 'ఈ నెల 13 నుంచి నిర్వహించిన తనిఖీలలో 58 కేసులు నమోదు చేశాం. వాటిలో నాలుగింటిని సీజ్ చేశాం. కేసులు నమోదు చేసి రూ.9,58,480 వసూలు చేశాం' అని రవాణా శాఖాధికారులు తెలిపారు.

ఉప్పుటేరులో చేపల మృతిపై మత్స్యకారుల ఆందోళన

▸ వార్త 7లో..

ఘనంగా నాగుల చవితి వేడుకలు

▸ వార్త 7లో..

చికిత్స కోసం వచ్చి బంగారం చోరీ


▸ వార్త 3లో..

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా

సంతకాల సేకరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను పిపిపి పద్ధతిలో ప్రైవేటీకరణ చేయాలన్న చర్యను నిరసిస్తూ ప్రజా ఆరోగ్య వేదిక, ప్రజా ఆరోగ్య పరిరక్షణ కమిటీ సంయుక్తంగా ప్రజల నుంచి సంతకాల సేకరణ ఉద్యమాన్ని చేపట్టాయి. శనివారం ఉదయం 7:30 గంటలకు సీతమ్మధార రైతు బజార్ వద్ద సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మొదటి సంతకం రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి జివి.రమణ చేశారు. అనంతరం ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సంతకాలు చేశారు.

పిపిపి విధానంతో తలెత్తే ఇబ్బందులపై ప్రజా ఆరోగ్య వేదిక నాయకులు ప్రజలతో వివరంగా చర్చించారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించవద్దంటూ ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందని, దీనిని



తొలి సంతకం చేస్తున్న రమణ

దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని నగరంలోని మరిన్ని ప్రాంతాల్లో నిర్వహించాలని నిర్ణయించినట్లు కామేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ప్రజా ఆరోగ్య పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ చంద్రమౌళి పాల్గొన్నారు.

మొంథా అలర్ట్



- తుపాను హెచ్చరికల నేపథ్యంలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- ఫోన్ నెంబర్లను అందుబాటులోకి తెచ్చిన విద్యుత్ శాఖ

బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్ప పీడనం మొంథా తుపానుగా దూసుకొస్తోంది. మూడు రోజులపాటు దీని ప్రభావం ఉండనుంది. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో విశాఖ, అనకాపల్లి జిల్లాల అధికారులు ఇప్పటికే అప్రమత్తమయ్యారు. విద్యుత్ శాఖ పలు ఏర్పాట్లు చేసింది. ప్రజల సహాయార్థం ఫోన్ నెంబర్లను అందుబాటులోకి తెచ్చి కంట్రోల్ రూమ్‌లను సిద్ధం చేసింది.

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మొంథా తుపాను హెచ్చరికల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. శనివారం జిల్లా, మండల, జోనల్ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను కారణంగా రాబోయే 72 గంటలు అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి పరిస్థితి ఎదురైనా ఎదుర్కోవడానికి అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని అన్నారు. ఆస్తి, ప్రాణ, పశు, పంట నష్టం జరగకుండా అధికార యంత్రాంగం అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా, డివిజన్, మండల, గ్రామ స్థాయి అధికార యంత్రాంగం అంతా పనిచేసే ప్రదేశాల్లోనే ఉండాలని, హెడ్ క్వార్టర్స్ వదిలి వెళ్లరాదని అన్నారు. ఉద్యోగులకు ఎలాంటి సెలవులూ మంజూరు చేయరాదని తెలిపారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లకుండా చూడాలన్నారు. తుపాను వల్ల భారీ వర్షాలు, పెనుగాలులు వచ్చే అవకాశం ఉన్నందున నది ఒడ్డులో, కొండ వాలులో, నీటి ముంపునకు గురయ్యే పల్లపు ప్రాంతాల్లో ఉండే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో 0891-2590102, 0891- 2590100 నెంబర్లతో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి, షిఫ్ట్‌ల వారీగా సిబ్బందిని నియమించామని, తుపాను సమయంలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల అధికారులు పాల్గొన్నారు.

అనకాపల్లి : మూడు రోజులపాటు విస్తారంగా వర్షాలు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

మొంథా అలర్ట్

కురిసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయం, డివిజన్, మండల కేంద్రాలలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం కంట్రోల్ రూమ్ - 08924 222888, 08924 225999, 08924 226599 నెంబర్లతో, మండల కార్యాలయ కంట్రోల్ రూమ్‌లు పాయకరావుపేట - 08931 520529, నక్కపల్లి - 08931 293541, ఎస్.రాయవరం - 7670978797, యలమంచిలి - 08931 293155, అచ్యుతాపురం - 08924 247241, పరవాడ- 08924 247433 నెంబర్లతో పనిచేస్తాయని వెల్లడించారు. .

విద్యుత్‌శాఖ అప్రమత్తం

సీతమ్మధార : మొంథా తుపాన్ నేపథ్యంలో ఎలాంటి పరిస్థితులు తలెత్తినా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డి పృథ్వీతేజ్ ఇమ్మడి సంస్థ పరిధిలోని 11 జిల్లాల అధికారులను అప్రమత్తం చేశారు. ఈ మేరకు కాకినాడ, కోనసీమ, ఏలూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, అనకాపల్లి, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ముందస్తు ఏర్పాట్లు చేశారు. విద్యుత్తు సరఫరాలో ఎలాంటి అంతరాయాలూ లేకుండా చూడాలని, అవసరమైన యంత్రాంగాన్ని, పరికరాలను, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఎస్ఇ, ఇఇలను ఆయన ఆదేశించారు. సంస్థ కార్పొరేట్ కార్యాలయం నుంచి ఎప్పటికప్పుడు టెలీ కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ విద్యుత్తు పునరుద్ధరణ చర్యలు చేపట్టేందుకు సంస్థ డైరెక్టర్లకు, 11 జిల్లాల అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. విద్యుత్ పునరుద్ధరణ చర్యలను పర్యవేక్షించేందుకు కార్పొరేట్ కార్యాలయం నుంచి సిజిఎం, జిఎం, ఈఈ, డిఈఈలను ప్రత్యేక అధికారులుగా నియమించారు. ప్రజల సహాయార్థం కార్పొరేట్ కార్యాలయంలో టోల్ ఫ్రీ నెంబర్ 1912ను, 8331018762ను అందుబాటులో ఉంచామన్నారు.



తరగతి గదులను ప్రారంభిస్తున్న వెంకట సుబ్బారావు

ఎవిఎన్‌లో ఆధునిక తరగతి గదులు ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: ఎవిఎన్ కళాశాలలో నూతన తరగతి గదులు, ఆధునీకరణ విభాగాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రాజెక్టు ప్రధానదాత పూర్వ విద్యార్థి సి.హెచ్. వెంకటసుబ్బారావు, ఎయు ఉపకులపతి ఆచార్య జి.రాజశేఖర్ సంయుక్తంగా వీటిని ప్రారంభించారు. కళాశాల కరస్పాండెంట్ ఎ.వి.అదీప్‌భానోజీరావు, కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు అజ్జరపు సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. వేడుకల్లో పూర్వ విద్యార్థుల సంఘం మాజీ అధ్యక్షులు మాకిన శ్రీనివాసరావు, కార్యదర్శి ఎన్.వి.ఎన్.రామసాయి, కోశాధికారి భారతి, సభ్యులు నారాయణస్వామి, శ్రీనివాసరావు, త్యాగరాజన్ సహా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి.కృష్ణకుమారి పూర్వ ప్రిన్సిపల్ ఎం.సింహాద్రినాయుడు, కళాశాల సిబ్బంది అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. కొత్తగా నిర్మించిన బోర్డురూమ్, బోటనీ ల్యాబ్, మహిళల ప్రత్యేక విశ్రాంతి గది, ఆధునీకరించిన 11 తరగతి గదులను పరిశీలించారు. దాతలకు, పూర్వ విద్యార్థుల సంఘానికి కళాశాల కరస్పాండెంట్, వైస్‌చైర్మన్ ఎ.విఅదీప్‌భానోజీరావు కృతజ్ఞతలు తెలియజేశారు. కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు పర్యవేక్షణలో పనులు పూర్తయ్యాయి.

మెడికవర్‌లో 'స్లీప్ ల్యాబ్'

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: నిద్రసంబంధిత శ్వాసకోశ రుగ్మతలు, ముఖ్యంగా అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా వంటి సమస్యలతో వచ్చే తీవ్ర అనారోగ్యా న్ని ముందుగా గుర్తించి, సమర్థంగా చికిత్స అందించే లక్ష్యంతో, మెడికవర్ హాస్పిటల్స్ ఎంవిపి బ్రాంచ్‌లో శనివారం అత్యాధునిక 'స్లీప్‌ల్యాబ్'ను ప్రారంభించింది. ఎంవిపి కాలనీలోని మెడికవర్ హాస్పిటల్స్ 6వ అంతస్తులో ఈ ప్రత్యేక సదుపాయం లాంఛనంగా అందుబాటులోకి వచ్చింది.

ఈ సందర్భంగా మెడికవర్ హాస్పిటల్స్ పల్మనాలజీ విభాగాధిపతి డాక్టర్ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ గురక, నిద్రాభంగం వంటి సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో, ఈ కొత్తల్యాబ్‌ను అధునాతన సాంకేతిక పరికరాలతో ఏర్పాటు చేసామని ఈ స్లీప్ ల్యాబ్, కచ్చితమైన రోగ నిర్ధారణ కోసం సమగ్రమైన, నాన్-ఇన్వాసివ్ నిద్రా అధ్యయనాలను అందిస్తుందని, దీని ద్వారా రోగుల కోసం వ్యక్తిగతీకరించిన, ప్రభావవంతమైన చికిత్సా పద్ధతులను రూపొందించడానికి వీలవుతుందన్నారు. పల్మనాలజిస్ట్ డాక్టర్ సుధీర్, డాక్టర్ సత్యపద్మజ, డాక్టర్ మోనిష, సెంటర్ హెడ్ డాక్టర్ అరుణ్ కుమార్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉసూరుమనిపించారు !

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

సిఎం చంద్రబాబు ఉద్యోగ, ఉపాధ్యాయులతో 16 నెలలు చర్చించకుండా తీరిగ్గా ఇటీవల చర్చలకు పిలిచి వారిని ఉసూరుమనిపించారు. ఇవ్వాల్సిన నాలుగు డిఎలకు ఒక్క డిఎ ఇస్తానని చెప్పి, దాన్ని కూడా నాలుగు ముక్కలు చేసి 2027 వరకూ సాగదీయడం వారిలో తీవ్ర ఆవేదనను మిగిల్చింది. డిఎలకే ఇన్ని పిల్లి మొగ్గలు వేస్తే పిఆర్‌సి అమలు సంగతేమిటి ? వాటి బకాయిలు ఇచ్చేదెప్పుడు ? అంటూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు విశాఖ జిల్లాలో బాహాటంగానే చర్చించుకుంటున్నారు. పెరిగిన ధరల సూచీకి అనుగుణంగా ఆరు నెలలకు ఓసారి ఇవ్వాల్సిన డిఎను చంద్రబాబు కూటమి ప్రభుత్వం ఎగ్గొడుతూ వచ్చి, ఇటీవల ఒక్క డిఎకు ఓకే చెప్పింది. ఎన్నికలకు ముందు వారికి ఇళ్ల స్థలాలిస్తానని, శని, ఆదివారాల్లో సెలవులు ఇస్తానని, పిఆర్‌సి, ఐఆర్ ఇవ్వడమేగాకుండా గత బకాయిలన్నిటినీ ఇచ్చేస్తామంటూ కూటమి నేతలు వాగ్దానాలు చేశారు. అధికారం వచ్చాక ఆర్థిక పరిస్థితి బాగోలేదంటూ వారితో చర్చల్లో భాగంగా ముఖ్యమంత్రి సర్దిచెప్పి పంపించేశారు. పిఆర్‌సి మాదిరిగా డిఎ బకాయిలు ఎప్పుడు పే చేస్తారన్న సందిగ్ధం టీచర్లు, ఉద్యోగుల రిటైర్మెంట్ వరకూ వెంటాడుతూనే ఉంటుంది. తొలి విడత చర్చల్లో మాత్రం ముఖ్యమంత్రి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలను కూర్చొబెట్టి రిటైర్మెంట్ తర్వాత ఇస్తామని, ఒకవేళ ఉద్యోగులు



చనిపోతే వారి వారసులకిస్తామంటూ 'సర్కారీ పాట'ను అందుకోవడంతో యుటిఎఫ్ వంటి సంఘాలు తీవ్రస్థాయిలో వ్యతిరేకించాయి. ఆందోళనలు సైతం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టాయి. తర్వాత ప్రభుత్వం సవరణ చేస్తూ ఈ నవంబర్ జీతంతో పాటు ఒక డిఎ శాతం కొంత కలిపి ఇచ్చేందుకు అంగీకరించింది. సవరించిన డిఎ ఉత్తర్వుల ప్రకారం ఏప్రిల్ 2026 నాటికి 10 శాతం, 2026 ఆగస్టు నాటికి 30 శాతం, నవంబర్ 2026 నాటికి 30 శాతం, ఫిబ్రవరి 2027 నాటికి 30 శాతం ఇచ్చేందుకు ప్రభుత్వం ఒప్పుకుంది.

గత ప్రభుత్వంలోనూ అవస్థలు

గత ప్రభుత్వంలోనూ ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర అవస్థలు పడ్డారు. అప్పట్లో డిఎలు ఇవ్వలేదు. పిఆర్‌సి కాలంలో డిఎలను కలిపేసి శాలరీ పెరిగిందని చెప్పేసి చేతులు దులుపుకుంది. కూటమి ప్రభుత్వం చర్చలకు పిలిచిందన్న సంతృప్తి ఉద్యోగుల్లో కాస్త ఉన్నా పిఆర్‌సి బకాయిలు, కమిషన్ అమలుపై మాత్రం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల్లో ఆందోళన కొనసాగుతోంది.

పోరాడి సాధించుకోవాలన్న పంథాతో వీరు ముందుకు సాగుతున్నారు. ముక్కలైన డిఎలను సైతం ప్రభుత్వం అంత సులభంగా ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదని విశాఖ జిల్లాకు చెందిన కొంతమంది ఉపాధ్యాయ సంఘాల నాయకులు వాపోతున్నారు.

బోనస్ పెంచాలి

డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకటరావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, వారితో పాటు రక్షణ రంగ ఉద్యోగులకు ప్రతి సంవత్సరం బోనస్‌ను విజయదశమికి అందజేసేవారని, మోడీ ప్రధాని అయిన తర్వాత దీపావళికి చెల్లించడం మొదలుపెట్టారని, అది కూడా సక్రమమైన పద్ధతిలో ఉండటం లేదని డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకటరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పుడు దీపావళి అయిన తర్వాత ఉత్పత్తితో కూడిన బోనస్‌ను 33 రోజులకు ప్రకటించారన్నారు. దీనిని విశాఖ రక్షణ రంగంలోని డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ, దాని భాగస్వామ్య పక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయన్నారు. అనేక సంవత్సరాల పాటు 40 రోజులుపైన బోనస్ పొందిన వారికి ఇప్పుడు దిగ్గోసి కేవలం 33 రోజులు మాత్రమే ఇవ్వడం దారుణమన్నారు. దీనిపై రక్షణ రంగ ఉద్యోగులు, కార్మికులు తీవ్రమైన అసంతృప్తితో ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. 2023 - 24తో పోలిస్తే 2024- 25లో ఉత్పత్తి తగ్గలేదని, అటువంటప్పుడు ఎందుకు బోనస్‌ను 33 రోజులకు తగ్గించారో వివరణ ఇవ్వాలని అన్నారు. బిజెపి ప్రభుత్వానికి తందాన పాడే బిఎంఎస్ యూనియన్ కార్మిక వర్గంపై ఫిర్యాదులు చేయడమే పనిగా పెట్టుకుందన్నారు. ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ హాజరు పద్ధతిని అమలు జరపాలని, డ్యూటీకి హాజరయ్యేటప్పుడు ఇస్తున్న గ్రేస్ కాలాన్ని ఎత్తివేయాలని కోరుతోందని, యూనియన్ నాయకులపై వ్యక్తిగతంగా ఫిర్యాదులు చేస్తోందని తెలిపారు. క్యాంటీన్ మేనేజింగ్ కమిటీకి ఎన్నికలు జరగకుండా అడ్డుపడిందని, ఉమ్మడి పోరాటాలకు తూట్లు పొడుస్తోందని పేర్కొన్నారు. ఇప్పుడు తగ్గించిన బోనస్‌పై ప్రభుత్వానికి వంతపాడుతోందని విమర్శించారు. ఐఎన్‌టియుసి అనుబంధ సంఘం గ్రూపు తగాదాలతో ట్రేడ్ యూనియన్ ఉద్యమాలను నీరుగారుస్తోందన్నారు. దీనిని అలుసుగా తీసుకున్న మేనేజ్మెంట్లు, కేంద్ర ప్రభుత్వం రక్షణ రంగ ఉద్యోగుల హక్కులపై దాడి చేస్తున్నాయని తెలిపారు. అందులో భాగంగానే ఈ రోజు బోనస్‌ను తగ్గించేశారన్నారు.

విభేదాలు అన్నింటినీ పక్కనపెట్టి కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలని విశాఖ రక్షణ రంగ కార్మిక వర్గానికి డిఫెన్స్ కోఆర్డినేషన్ కమిటీ తరపున పిలుపునిచ్చారు. రక్షణ రంగంలోని ఫెడరేషన్లు అన్నీ అఖిలభారత స్థాయిలో ఉమ్మడి ఉద్యమానికి పిలుపునివ్వాలని విజ్ఞప్తి చేశారు.

వైసిపి విద్యార్థి విభాగం అధ్యక్షునిగా శ్రీవత్సవ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: వైసిపి రాష్ట్ర స్థాయిలో 5 జోన్లకు విద్యార్థి విభాగం అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన చేసింది. ఇందులో భాగంగా జోన్ 1 అధ్యక్షునిగా దక్షిణ నియోజవర్గానికి చెందిన ద్రోణంరాజు శ్రీవత్సవ నియమితులయ్యారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలో కలిపి జోన్ 1 ఒకటిగా, పేర్కొని ఈ నియామకం చేశారని, ఇందుకు పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు శ్రీవత్సవ మీడియాకు తెలిపారు. పార్టీ ఇచ్చిన బాధ్యత మేరకు ఆరు జిల్లాలలో విద్యార్థి విభాగాన్ని బలోపేతం చేసేందుకు శక్తి మేరకు తాను కృషి చేస్తానని తెలిపారు.

ఎల్‌టిఆర్ ఫిర్యాదుల స్వీకరణ

ప్రజాశక్తి- చింతూరు: చింతూరు ఐటిడిఎ పరిధిలో ఎల్‌టిఆర్ సెల్‌ను ఏర్పాటు చేసినట్టు పిఒ శుభం నొక్వాల్ తెలిపారు. నెల రోజుల వరకూ దీనిని నిర్వహించనున్నట్టు దీనిలో డిప్యూటీ తహశీల్దార్ జె. విలెంటన్ బాబు, 9014677374, ట్రైబల్ వెల్ఫేర్ కోర్టు వారిని ఫిర్యాదలు స్వీకరించడానికి నియమించినట్టు తెలిపారు.

బ్రెస్ట్ కేన్సర్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ: బ్రెస్ట్ కేన్సర్‌పై అవగాహన అవసరమని సిపి డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. ప్రపంచ బ్రెస్ట్ కేన్సర్ మాసాన్ని పురస్కరించుకుని విశాఖపట్నం హెచ్‌సిజి క్యాన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో 'ది పింక్ స్పిరిట్' పేరిట అవగాహన కార్యక్రమాన్ని శనివారం సిరిపురంలోని విఎంఆర్డిఎ చిల్డ్రన్స్ ఏరినా వేదికగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపి డాక్టర్ శంఖబ్రత బాగ్చి హాజరయ్యారు. బ్రెస్ట్‌క్యాన్సర్ వల్ల వచ్చే ప్రమాదాలు నివారణ మార్గాలను క్షుణ్ణంగా వివరించారు. ఇటీవల బ్రెస్ట్ కేన్సర్ ఆడవాళ్లలోనే కాకుండా మగవాళ్ళలో కూడా వస్తోందని ముఖ్యంగా మహిళలు బ్రెస్ట్ కేన్సర్‌పై



కార్యక్రమంలో పాల్గొన్న సిపి శంఖబ్రత బాగ్చి

అవగాహన కలిగి ఉండాలని అనుమానం ఉంటే వెంటనే డాక్టర్లను సంప్రదించి ప్రారంభ దశలోనే చికిత్స పొందడం ద్వారా మరణాన్ని జయించవచ్చునన్నారు. అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్న హెచ్సిజి హాస్పిటల్ యాజమాన్యాన్ని అభినందించారు. అనంతరం విశాఖపట్నం హెచ్‌సిజి సెంటర్ క్లస్టర్ సిఇఒ డాక్టర్ ఆదిత్యకౌర మాట్లాడుతూ బ్రెస్ట్ క్యాన్సర్ మాసాన్ని పురస్కరించుకుని 40 సంవత్సరాలు దాటిన మహిళలకు ఉచిత మమ్మోగ్రఫీ స్క్రీనింగ్‌ను అందిస్తున్నా మని, అంతేకాకుండా 14 సంవత్సరాలు దాటిన బాలికలకు హెచ్‌పివి వ్యాక్సిన్ ఒక్కొక్క డోసు రూ.3299కి అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు మహిళా డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్య ప్రయివేటీకరణను ప్రతిఘటిద్దాం

ఎఐఎస్ఎఫ్ అవగాహనా సదస్సులో రామాంజనేయులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : విద్యతోపాటు పలు రంగాలను ప్రయివేటుకు కట్టబెట్టాలన్న ప్రభుత్వాల చర్యలను ప్రతిఘటిద్దామని ఎఐఎస్ఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి కె. రామాంజనేయులు అన్నారు. శనివారం విశాఖ స్టీల్‌ప్లాంట్ ఆంధ్ర కేసరి సెమినార్ హాల్‌లో ఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలపై అవగాహన సదస్సు జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న బస్సు యాత్ర సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉల్లం.నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో రాష్ట్రంలో విద్యారంగం మొత్తం ప్రైవేటీకరణ వైపు అడుగులు వేస్తోందన్నారు. అందులో భాగంగానే 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేస్తున్నారని విమర్శించారు. దీంతో పేద విద్యార్థులకు వైద్యవిద్య దూరమౌతుందన్నారు. ఎఐటియుసి జాతీయ ఉపాధ్యక్షులు, విశాఖ ఉక్కు పోరాట కమిటీ ఛైర్మన్ ఆదినారాయణ మాట్లాడుతూ అనేకమంది పోరాట త్యాగాల ఫలితంగా ఏర్పడిన విశాఖ ఉక్కును ప్రయివేటీకరణ చర్యలను నిరసిస్తూ ఇటీవల విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో శంఖారావం పూరించామన్నారు. భవిష్యత్తులో విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు వివిధ రూపాలలో భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడదామని తెలిపారు. ఎఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు గుజ్జుల.వలరాజు, బందెల నాసర్ జి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని. గిరిజన హాస్టల్‌లో మరణాలు అరికట్టాలన్నారు. 3 పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జిఒ 77 రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న రూ.6400 కోట్ల ఫీజ్ రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలు చెల్లించాలన్నారు. బస్సుయాత్ర ముగిసే లోపు డిమాండ్లను పరిష్కరించకపోతే భారీ ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సదస్సులో ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె. అచ్యుతరావు పాల్గొని మద్దతు తెలిపారు. ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శులు ఎన్. నాగభూషణ్, మస్తాన్ షరీఫ్ కుళాయి స్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షులు చలపతి, జిల్లా నాయకత్వం శేఖర్ మౌనిక కిరణ్ అభిషేక్ కంజీర గణేష్ హారిక పాల్గొన్నారు.



సదస్సులో సంఘీభావంగా ఎఐఎస్ఎఫ్ నేతలు

రోడ్డు ముంపు సమస్యకు తాత్కాలిక పరిష్కారం



జెసిబితో నీటిని తొలగిస్తున్న యంత్రాంగం

ప్రజాశక్తి-ఆనందపురం: విశాఖపట్నం నుంచి తగరపువలస వెళ్లే రహదారిలో, వెల్లంకి వద్ద సర్వీస్ రోడ్డుపై నిలిచిన నీటి సమస్యకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఆయన తనయుడు గంటా రవితేజ చొరవతో తాత్కాలిక పరిష్కారం లభించింది. శనివారం ఉదయం జాతీయ రహదారుల విభాగం అధికారులు, స్థానిక నాయకులతో కలిసి వెల్లంకి సర్వీస్ రోడ్డును పరిశీలించారు. రోడ్డుపై నిలిచిన నీటిని జెసిబి సహాయంతో గెడ్డ వైపునకు మళ్లించి తాత్కాలిక పరిష్కారం చేశారు.
నీటి ముంపు సమస్య తాత్కాలిక పరిష్కారమైనప్పటికీ, దీనిపై సోమవారం రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, నేషనల్ హైవే అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి, శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపడతామని ఎమ్మెల్యే గంటా హామీ ఇచ్చారు. పరిశీలనలో స్థానిక టిడిపి నాయకులు కాకర వెంకటరమణ, సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, పిన్నింటి వెంకటరమణ, యువ నాయకుడు కాకర సురేష్ కుమార్, పెసల సాయి పాల్గొన్నారు.

నేడు ఎన్ఎంఎంఎస్ మోడల్ పరీక్ష

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఎన్ఎంఎంఎస్ మోడల్ పరీక్ష నిర్వహించనున్నట్లు ౼లని ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు తెలిపారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే నమూనా పరీక్షను భీమిలి నియోజకవర్గంలోని విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అనాథ పిల్లలకు అల్పాహారం



అల్పాహారం ఇస్తున్న వైసిపి యువనేత జగన్

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని తాళ్లవలస లిటిల్ హగ్ ఆర్గనైజేషన్ అనాథ పిల్లలకు నాగులచవితి సందర్భంగా శనివారం భీమిలి నియోజకవర్గ వైసిపి యూత్ అధ్యక్షుడు ఇల్లాపు వెంకట జగన్ అల్పాహారం అందించారు. అలాగే పలుచోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అనాథ పిల్లలతో నాగులచవితి వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందని జగన్ అన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి- పెందుర్తి: మేహాద్రి డ్యాం సమీపంలో శనివారం ఉదయం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. సిఐ సతీష్ కుమార్ తెలిపిన వివరాలివి. శనివారం ఉదయం ఫోన్ ద్వారా అందిన సమాచారం మేరకు పెందుర్తి పోలీసులు మేఘాద్రిగెడ్డ డ్యాం వద్దకు వెళ్లి పరిశీలించగా, రిజర్వాయర్ గేట్ల వద్ద నీటిలో గుర్తు తెలియని 35-40ఏళ్ల పురుషుని మృతదేహం గుర్తించారు. ఎడమ చేతి మణికట్టుకు ఎరుపురంగు తాడు కడియంలా కట్టబడి ఉంది. శవంపై గ్రే/బ్లాక్ రంగు ఫుల్‌పాంట్ ఉంది. కొద్ది దూరంలో బ్లూరెడ్ చెక్స్ ఫుల్ హ్యాండ్స్ షర్ట్, చెప్పులు గుర్తించారు. మృతదేహాన్ని కెజిహెచ్ మార్చురీకి తరలించారు. ఆచూకీ తెలిస్తే పెందుర్తి పోలీస్‌స్టేషన్ (96767 97314), సిఐ సతీష్‌కుమార్ : (96767 97314) ఫోన్ నెంబర్లకు సమాచారమివ్వాలని కోరారు.

బలవంతంగా భూములు లాక్కోవద్దు

తర్లువాడ దళితుల సమస్యపై లేఖ రాసిన కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి

ప్రజాశక్తి- ఆనందపురం: గూగుల్ డేటా సెంటర్ కోసం తర్లువాడ దళితులను నుంచి భూములను బలవంతంగా తీసుకోవడం సరికాదని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి అన్నారు. దళితుల భూములు రక్షించాలంటూ సాంఘిక సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి , ఎస్‌సీ కమిషన్ ఛైర్మన్‌లకు లేఖ రాసినట్లు తెలిపారు.
1971లో అప్పటి ప్రభుత్వం తర్లువాడలో 49 కుటుంబాలకు ఒక్కొక్కరికీ 2 ఎకరాలు, మరికొందరిక ఎకరా చొప్పున భూమి కేటాయించగా, రాళ్లు, రప్పలు భూములను కష్టపడి సాగులోకి తెచ్చి, 54 సంవత్సరాలుగా వ్యవసాయం ద్వారా జీవనం కొనసాగిస్తున్నారనానరు. పదేళ్ల క్రితం డంపింగ్ యార్డులు, బ్యాటరీ కంపెనీలు, ఇతర ప్రాజెక్టులకు ల్యాండ్ పూలింగ్ ద్వారా తీసుకునే ప్రయత్నం చేయగా, హైకోర్టు జోక్యంతో అడ్డుకట్ట పడిందన్నారు. ఇపుడు గూగుల్ డేటా సెంటర్ కోసం భూములివ్వాల్సిందేనని రెవెన్యూ అధికారులు ఒత్తిడి చేస్తున్నారన్నారు ఈనెల 16న కలెక్టర్ హరేంధిర ప్రసాద్ స్వయంగా పిలిపించి భూములివ్వాలని కోరగా, దళిత రైతులు నిర్ద్వందంగా తోసిపుచ్చారన్నారు. రైతులను ఒప్పించి, వారి ఇష్టపూర్వకమైతే తగు పరిహారం, ప్యాకేజీ, ఉద్యోగాలిచ్చి, సమగ్ర పరిష్కారం చూపడం ద్వారా భూములు తీసుకోవాలేగానీ, ఇలా ఒత్తిడిచేసి లాక్కోవాలనుకోవడం సరికాదన్నారు. దళిత భూముల రక్షణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు.

టేబుల్ టెన్నిస్ ఎంపిక పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి -గోపాలపట్నం : స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గోపాలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్, ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఇంటర్ డిస్ట్రిక్ట్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ కమ్ సెలక్షన్ పోటీలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. క్రీడాకారులు నుండి గౌరవ వందనం స్వీకరించారు. 13 జిల్లాల నుంచి అండర్ 14, 17, 19 విభాగాలు బాల బాలికల క్రీడాకారులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడల్లో రాణించి జాతీయస్థాయిలో ప్రతిభ కనబరుస్తూ ప్రాంతానికి , రాష్ట్రానికి పేరుప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు కార్యక్రమంలో డిఇఒ ప్రేమ్ కుమార్, డిప్యూటీ డిఇఒ, ఆప్తా వైస్ ప్రెసిడెంట్, స్కూల్ గేమ్ ఫెడరేషన్ సభ్యులు, స్కూల్ హెచ్ఎం సిబ్బంది పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

చెరువులకు జలకళ



నీటితో కళకళలాడుతున్న నూక మామిడిచెరువు

ప్రజాశక్తి-పద్మనాభం: మండలంలోని పలు గ్రామాల్లో చెరువులన్నీ నిండుకుండలను తలపిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువుల్లోకి భారీగా నీరు చేరడంతో జలకళ సంతరించుకుంది. మండలంలోని రెడ్డిపల్లి నుండి పొట్నూరు వెళ్లే మార్గంలో నూక మామిడికాయ చెరువు పూర్తిగా నీటితో నిండిపోయి కళకళలాడుతోంది. ప్రస్తుత పరిస్థితులను సాగుకు అనుకూలంగా ఉన్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేరాలు ఘోరాలు

నదిలో జారిపడిన యువకుడు మృతి

ప్రజాశక్తి-తగరపువలస : భీమునిపట్నం మండలం పాత మూలకుద్దు గ్రామంలో నాగుల చవితి రోజున విషాదం చోటుచేసుకుంది. గోస్తనీ నదిలో పూజా సామగ్రిని కడిగేందుకు వెళ్లిన చిల్ల శ్రీను (18) అనే యువకుడు ప్రమాదవశాత్తు జారిపడడంతో నదీ ప్రవాహ ఉధృతికి కొట్టుకుపోయాడు పక్కనే ఉన్న తన తోటిస్నేహితులు కేకలు వేయగా చుట్టుపక్కల వారు వచ్చి గాలించే ప్రయత్నం చేశారు. భీమిలి పోలీసులకు సమాచారం అందించారు. కృతుడు కష్ణ కాలేజీలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతూ ఎన్‌సిసి క్యాడెట్‌గా ఉన్నాడు. మృతుని తల్లిదండ్రులు సిహెచ్ .రమణ, లక్ష్మి ఇద్దరూ వ్యవసాయ కూలీలే. అక్క మేఘన ఉంది. చిట్టివలస అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రెండు ఇంజన్ బోట్లు సహాయంతో యువకులు,.మత్స్యకారులతో కలిసి నదిలో గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

చికిత్స కోసం వచ్చి బంగారం చోరీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : చికిత్స కోసం వచ్చిన ఓ మహిళ ఆర్‌ఎంపి బంగారం కాజేసింది. టూటౌన్ క్రైమ్ పోలీసులు 24 గంటల్లో ఆమెను పట్టుకొని బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. గురువారం మధ్యాహ్నం కొబ్బరితోట ప్రాంతంలో రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్ (ఆర్‌ఎంపి) కటకం రాజేశ్వరి నిర్వహిస్తున్న శ్రీ క్లినిక్ వద్దకు చికిత్స కోసం ఇద్దరు మహిళలు వచ్చారు. ఒక మహిళ అనారోగ్యంగా ఉండటంతో ఆమెను లోపలకు తీసుకువెళ్లి సెలైన్ బాటిల్ పెట్టి చికిత్స చేశారు. అనంతరం ఆర్‌ఎంపి స్పృహతప్పి పడిపోయారు. అది చూసిన ఆ ఇద్దరు మహిళలు ఆమెను స్పృహలోకి తెచ్చే ప్రయత్నం చేసినా ఫలించలేదు. ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. ఇదే అదనుగా భావించిన మహిళ ఆమె ఒంటిపై ఉన్న 101/4 గ్రాముల బంగారు వస్తువులతో ఉడాయించింది. ఇంతలో ఆర్‌ఎంపి కుటుంబ సభ్యులు వచ్చి చికిత్స కోసం ఆమెను కెజిహెచ్‌కు తరలించారు. సాయంత్రానికి అపస్మారకస్థితి నుంచి తేరుకున్న ఆమె తన నగలు పోయినట్టు గ్రహించి టూ టౌన్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు దర్యాప్తు చేపట్టి సిసి టివి ఫుటేజ్ ద్వారా మర్రిపాలెం మహారాణిపేట వీధికి చెందిన యల్లిబిల్లి సత్యవతిగా గుర్తించారు. ఆమెను అదుపులోకి తీసుకుని విచారించి కాజేసిన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాత్రీ పగలు తేడా లేకుండా మద్యం అమ్మకాలు నిర్వహిస్తున్నారన్న సమాచారం అందడంతో మహారాణిపేట పోలీసులు ఆకస్మికంగా దాడులు చేసి పెద్ద ఎత్తున మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ.50 వేలు ఉంటుంది. పోలీసులు అందజేసిన సమాచారం ప్రకారం శనివారం ఉదయం 7 గంటల ప్రాంతంలో పందిమెట్ట జంక్షన్‌లోని శ్రీ శివ శంకర బార్ అండ్ రెస్టారెంట్‌పై పోలీసులు పక్కా సమాచారంతో ఆకస్మికంగా దాడులు చేశారు. బార్ లో ఒకపక్క అమ్మకానికి ఉంచిన మద్యం ఫుల్ బాటిల్స్ 8, బీరు బాటిల్స్ 67, వాటర్ బాటిల్స్ 115, టిన్ బీర్లు 10, బిజర్స్ 10, మొత్తం 210 బాటిళ్లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఆ సమయంలో మద్యం అమ్మకాలు చేస్తున్న సేల్స్‌మ్యాన్ కొసంగి కనకరాజును అదుపులోకి తీసుకున్నారు. ఆయన పెదగదిలి శివాలయం వీధికి చెందినవాడు. నిజానికి బార్ అండ్ రెస్టారెంట్‌లో మద్యం అమ్మకాలు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు మాత్రమే నిర్వహించాలి. అయితే ఇక్కడ షాపును తెరిచినప్పటినుంచి తెల్లవార్లు మద్యం అమ్మకాలు చేస్తున్నట్లు స్థానికులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు స్పందించి దాడులు చేపట్టినట్లు తెలిసింది. సిఐ గొలగాని దివాకర్ యాదవ్, ఎస్ఐ అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించారు.

ఘనంగా పారాయణ సేవ

ప్రజాశక్తి- వేపగుంట : సింహచలం వరహా లక్ష్మీనసింహ స్వామి వారి దేవస్థానంలో శనివారం మణవాళ మహామునులు తిరునక్షత్రం సందర్భంగా ఆలయ స్థానాచార్యులు టిపి రాజగోపాల్ ఆధ్వర్యంలో నాలాయిర దివ్య ప్రబంధ పారాయణ సేవ వైభవంగా జరిపించారు.పూజల్లో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వారికి తీర్థప్రసాదాలు అందజేశారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం

● భెల్ సిఐటియు మహాసభలో జిల్లా కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్

ప్రజాశక్తి-గాజువాక : ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్‌కెఎస్‌సి.కుమార్ పిలుపునిచ్చారు. శనివారం బిహెచ్‌పివి సిఐటియు కార్యాలయంలో ఎంప్లాయిస్ యూనియన్ 14వ మహాసభ జరిగింది. . భెల్ సిఐటియు అధ్యక్షులు కె.విజయ్ కుమార్ యూనియన్ పతాకవిష్కరణ చేశారు ప్రధాన కార్యదర్శి జిటిపి ప్రకాష్ కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టగా ఏకగ్రీవంగా ఆమోదించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై మొదటి నుంచి సిఐటియు ముందుండి పోరాటం చేస్తోందన్నారు. ప్రభుత్వరంగ పరిశ్రమల పరిరక్షణ, కార్మిక చట్టాలు, హక్కుల పరిరక్షణకు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న డిసెంబర్‌లో విశాఖలో జరగనున్న సిఐటియు జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు నేత కుమార్

జిల్లా మహాసభలో ఆర్ సీరీస్ కార్మికుల జాయినింగ్ తేదీ, హయ్యర్ పెన్షన్ అమలు, యువ కార్మికుల సమస్యలపై పోరాడాలని మూడు తీర్మానాలు చేశారు. రాబోవు మూడేళ్లలో చేపట్టాలని భవిష్యత్తు కార్యాచరణ, కార్మికులు కంపెనీ సమస్యలపై పనిచేయాలని జిల్లా నాయకత్వం నిర్దేశించింది. మహాసభలో సిఐటియు జిల్లా నాయకులు ఎస్ జ్యోతిశ్వరరావు, పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



కె విజయకుమార్



జిటిపి ప్రకాష్

భెల్ సిఐటియు నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షులుగా కె.విజయకుమార్, ప్రధాన కార్యదర్శిగా జిటిపి ప్రకాష్, కోశాధికారిగా కె.నారపరెడ్డి, గౌరవ ప్రచార కార్యదర్శిగా ఎస్ జగన్నాధరావుతోపాటు మరో 14 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక



ఎంపికైన మధురవాడ విద్యార్థులు

ప్రజాశక్తి -మధురవాడ : రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఆనంద్ తైక్వాండో అండ్ మార్షల్ ఆర్ట్స్ కు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. పరవాడలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జరిగిన అండర్ 19 బాలబాలికల పోటీల్లో వీరు సత్తాచాటారు. బాలికలు, 42 కిలోల విభాగంలో ఎన్ఆర్ఐ జూనియర్ కాలేజ్ విద్యార్థిని సతివాడ తులసీ ,బాలురు 45కిలోల విభాగంలో మారికివలస ఆదిత్య జూనియహర్ కాలేజీ విద్యార్థి సియ్యాద్రి నిఖిల్, 55 కిలోల విభాగంలో ఎస్‌కె రజాక్, 59 కిలోల విభాగంలో ఆసెంట్ జూనియర్ కాలేజీ విద్యార్థి ఎస్‌కె మహ్మద్ అష్రాప్ ప్రథమ స్థానాలలో నిలిచి, ఈ నెల 26, 27 తేదీలలో అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరులో జరిగే రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలలో ఉమ్మడి విశాఖ జిల్లా జట్టు తరపున పాల్గొంటారన్నారు. మధురవాడ శిల్పారామం శిక్షణా కేంద్రం వద్ద వీరిని ఎపి ఆమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బసనబోయిన ఆనందరావు అభినందించారు. ఫిట్‌నెస్ ట్రైనర్, తైక్వాండో కోచ్ బి.జగదీష్ పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ

ఆనందపురం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన హ్యాండ్‌బాల్ జిల్లా స్థాయి ఎంపికల్లో వెల్లంకి జెడ్‌పి ఉన్నతపాఠశాల విద్యార్థులు (ప్రతిభ చూపారు. అండర్-17 బాల, బాలికల విభాగాలలో విద్యార్థులు ఎ. సత్యనారాయణ, టి. కుసుమ, టి .పూజిత, పి..ధనలక్ష్మి, జి. శిరీష సత్తాచాటి జిల్లా పోటీలకు ఎంపికయ్యారు.అలాగే జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు టి. కుసుమ, జి. లాస్యప్రియ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ కుమార్ తెలిపారు. వీరిని హెచ్‌ఎం డి. రమేష్ కుమార్, పిఇటి తొనంగి సరిత,ఉపాధ్యాయులు అభినందించారు

పోరాటంతోనే పోర్టు ఆసుపత్రి పరిరక్షణ

390వ రోజుకు చేరిన రిలే దీక్షలు



దీక్షా శిబిరంలో కార్మికులతో పద్మనాభరాజు

ప్రజాశక్తి- సీతమ్మధార. : విశాఖ పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రి ప్రైవేటీకరణను నిరసిస్తూ పోర్ట్ ఆసుపత్రి వద్ద చేపట్టిన రిలేదీక్షలు శనివారం 390వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా డాక్ అండ్ పోర్టు ఎంప్లాయిస్ యూనియన్, సిఐటియు గౌరవాధ్యక్షులు పద్మనాభరాజు మాట్లాడుతూ, పోరాటంతోనే పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రి ప్రయివేటుపరం కాకుండా కాపాడుకుందామని పిలుపునిచ్చారు. ఆసుపత్రిని పోర్టు నిధులతోనే అభివృద్ధి చేయాలని, దీనికి ఒక కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 390రోజులుగా ఉద్యమిస్తున్న పోర్టు ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్లను అభినందించారు 40 వేల మంది కార్మికులు, వారి కుటుంబసభ్యుల ఆరోగ్యానికి సంబంధించిన పోర్టు ఆసుపత్రి ప్రయివేటీకరణ విషయంలో ప్రభుత్వాలు మొండిగా ఉండడం సరికాదన్నారు. పోర్టు యాజమాన్యం వద్ద రిజర్వ్ ఫండ్లు, వేల ఎకరాల భూమి ఉన్నప్పటికీ, ప్రైవేటీకరణపై తీసుకున్న నిర్ణయం అన్యాయమని, ఈ విధానాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ కొనసాగితే, కార్మికులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు కలిసి పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు సిద్ధమని హెచ్చరించారు.కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.సత్యనారాయణ, బి జగన్ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జి అజయ్, కార్మికులు పాల్గొన్నారు.

సుందరీకరణ వేగవంతం చేయండి



అధికారులకు సూచనలు చేస్తున్న జివిఎంసి కమిషనర్

ప్రజాశక్తి- సీతమ్మధార : విశాఖ వేదికగా జరుగనున్న అంతర్జాతీయ భాగస్వామ్య సదస్సుకు తక్కువ సమయమే ఉన్నందున నగర సుందరీకరణ, సంబంధిత అభివృద్ధి పనులను త్వరతగతిన పూర్తి చేయాలని జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం జోన్ 3, 4, 5, 8 లోని తెలుగుతల్లి ఫ్లై ఓవర్, తాటిచెట్లపాలెం, ఊర్వశి జంక్షన్, ఎన్ఎడి ఫ్లై ఓవర్, ఎయిర్‌పోర్ట్ వరకు, అలాగే ఆంధ్ర యూనివర్సిటీ గ్రౌండ్‌లో సిఐఐ భాగస్వామ్య సదస్సు ప్రధాన వేదిక ప్రాంతం, అంతర్జాతీయ భాగస్వామ్య సదస్సు కొరకు చేపడుతున్న అభివృద్ధి, నగర సుందరీకరణ పనులను అదనపు కమిషనర్ ఎస్ఎస్. వర్మ, ఇంజనీరింగ్ అధికారులు, ఎపి గ్రీన్ అర్బన్ కార్పొరేషన్ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా జివిఎంసి కమిషనర్ మాట్లాడుతూ వచ్చే నెలలో విశాఖ వేదికగా జరిగే అంతర్జాతీయ భాగస్వామ్య సదస్సు నాటికి ఆర్‌టిసి కాంప్లెక్స్ నుండి తెలుగుతల్లి ఫ్లై ఓవర్ కింద చేపడుతున్న సుందరీకరణ పనులతో పాటు రైల్వే న్యూ కాలనీ రోడ్డు ,తాటిచెట్లపాలెం, ఊర్వసి , ఎన్.ఎ.డి ఫ్లైఓవర్, ఎయిర్పోర్ట్ హైవే వరకు చేపడుతున్న రోడ్ డివైడర్స్, సెంటర్ మీడియన్, ఐలాండ్స్ , ఫుట్ పాతులు, రోడ్డు మరమ్మతులు, లైటింగ్,పెయింటింగ్ పనుల నాణ్యతను పరిశీలించి, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సెంటర్ మీడియన్‌లలో మొక్కలను క్రమపద్ధతిలో ఆకర్షణీయంగా ట్రిమ్మింగ్ చేయాలని, పెద్ద చెట్ల కొమ్మల కటింగ్ చేయడంతో పాటు సెంటర్ మీడియన్‌లలో పాడుబడిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటాలని ఆదేశించారు. అంతర్జాతీయ వేదిక జరిగే ఆంధ్ర యూనివర్సిటీ గ్రౌండ్ హెలిప్యాడ్‌ను పరిశీలించి అక్కడ చేపడుతున్న పెయింటింగు, సుందరీకరణ పనులను పరిశీలించి పనులలో నాణ్యతా ప్రమాణాలను తప్పకుండా పాటించి త్వరగా పూర్తిచేయాలని కమిషనర్ ఆదేశించారు. పర్యటనలో పర్యవేక్షక ఇంజనీరు కె.శ్రీనివాసరావు, ఇఇలు తారా ప్రసన్న, దిలీప్ పాల్గొన్నారు.

వైసిపి మండల ఉపాధ్యక్షునిగా దామోదర్



షిణగం దామోదరరావు

ప్రజాశక్తి- ఆనందపురం: వైసిపి ఆనందపురం మండల ఉపాధ్యక్షుడిగా షిణగం దామోదరరావు నియమితులయ్యారు. కుసులవాడ గ్రామానికి చెందిన దామోదరరావు తండ్రి మోహనరావు కుసులవాడ పంచాయతీ సర్పంచ్‌గా ప్రజలకు సేవలందించారు. ఆయన అడుగుజాడల్లోనే దామోదరరావు రాజకీయ ప్రస్థానం కొనసాగిస్తున్నారు. వైసిపి ఆవిర్భావం నుంచి ఆ పార్టీలోనే ఉంటూ కార్యక్రమాలను నిర్వహించిన దామోదరరావు సేవలను గుర్తించిన అధిష్టానం మండల ఉపాధ్యక్ష బాధ్యతలు అప్పగించింది. దీనిపై దామోదరరావు హర్షం వ్యక్తం చేస్తూ, పార్టీ అధ్యక్షుడు జగన్మోహనరెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి మజ్జి శ్రీనివాసరావు ఇతర నేతలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజలతో మమేకమై పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

అగ్ని ప్రమాద భద్రతపై మాక్‌డ్రిల్



మాక్‌డ్రిల్ ద్వారా ప్రయోగాత్మకంగా అవగాహన కల్పిస్తున్న ఫైర్‌సేఫ్టీ సిబ్బంది

ప్రజాశక్తి- మధురవాడ : అగ్ని ప్రమాద భద్రతపై గీతం దంత వైద్య కళాశాల, ఆసుపత్రి ఆవరణలో శనివార మాక్ డ్రిల్ నిర్వహించారు. గీతం సేఫ్టీ అండ్ సెక్యూరిటీ విభాగం పర్యవేక్షణలో అగ్ని ప్రమాద పరిస్థితిని అనుసరించి, అగ్ని అలారం మోగించడం, భవనాల నుండి సురక్షిత ప్రదేశాలకు తరలించడం, అగ్నిమాపక పరికరాల వినియోగం, అగ్నిని ఆర్పే పద్ధతులపై ప్రత్యక్ష ప్రదర్శనల ద్వారా ఫైర్ సేఫ్టీ నిపుణులు వివరించారు. గీతం దంత వైద్య కళాశాల, ఆసుపత్రి లోని సెక్యూరిటీ, శానిటేషన్, మెకానికల్, ఎలక్ట్రికల్ విభాగాల సిబ్బందికి మార్గనిర్దేశం చేశారు. ప్రతిఒక్కరూ భద్రతా నియమాలు, అత్యవసర ప్రణాళికలు పాటించేలా సహకరించారు.

ఈ సందర్భంగా గీతం వర్సిటీ సేఫ్టీ ఆఫీసర్ కెపి.చక్రధర్ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో స్పందన సమయాన్ని, సమన్వయాన్ని,నమ్మకాన్ని పెంచడానికి, భద్రతా ప్రణాళికల్లో ఉన్న లోపాలను గుర్తించి వాటిని మెరుగుపర్చడానికి ఇలాంటి మాక్ డ్రిల్లులు సహాయపడతాయన్నారు. కార్యక్రమంలో గీతం దంత వైద్యులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-మధురవాడ : మారికవలస విద్యు సబ్‌స్టేషన్ 11కెవి ఇండస్ట్రియల్ ఫీడర్‌లో విద్యుత్ లైన్ల నిర్వహణ, మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగింపు వంటి పనుల నేపథ్యంలో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ విభాగం మూడోజోన్ ఇఇ సింహాచలంనాయుడు తెలిపారు. మారికవలస గ్రామం, జంక్షన్, జెఎన్ఎన్‌యుఆర్‌ఎం కాలనీ, బోరవానిపాలలెం, డ్రైవర్స్ కాలనీ, జెకె.లేఅవుట్, కొత్త, పాత పరదేశిపాలెం ప్రాంతాలకు విద్యుత్ ఉండదని తెలిపారు.

కళా ఉత్సవ్ పోటీల్లో ప్రతిభ



కృష్ణారెడ్డి నుంచి బహుమతులు అందుకుంటున్న నిఖిల్

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ (డైట్) ఆధ్వర్యంలో ఈ నెల 23, 24 తేదీల్లో విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో విశాఖ జిల్లా విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ ఎల్ సుధాకర్ శనివారం తెలిపారు

నడుపూరు జెడ్‌పి హైస్కూల్ విద్యార్థి సిహెచ్ నిఖిల్ విజువల్ ఆర్ట్స్ 3 డి విభాగంలో ప్రథమ బహుమతి సాధించి, జాతీయ స్థాయి కళా ఉత్సవ్ పోటీలకు అర్హత సాధించాడు. అదే పాఠశాల విద్యార్థులు జానపద నృత్యం విభాగం లో ద్వితీయ బహుమతి పొందారు.

ఆరిపాక జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు కె నీలవేణి, కె దిలీప్ సాంప్రదాయ బొమ్మలు 2డి విభాగం లో ద్వితీయ బహుమతి పొందారన్నారు. చైతన్య స్కూల్ విద్యార్థిని చిత్రలేఖనం 2 డి విభాగంలో తృతీయ బహుమతి సాధించారన్నారు. ఎపి ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్ ఎంవి కృష్ణారెడ్డి బహుమతులు అందజేశారు. సత్తా చాటిన విద్యార్థులను డిఇఒ ఎన్ ప్రేమ్‌కుమార్, ప్రిన్సిపాల్ సుధాకర్, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు అభినందించారు

సముద్రంలో మత్స్యకారుడు గల్లంతు

తిక్కవారిపాలెంలో విషాదం

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ మండలంలోని తిక్కవారిపాలెం గ్రామ సమీపం సముద్రంలో శనివారం ఉదయం మత్స్యకారుడు గల్లంతయ్యాడు. దీంతో ఆ గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. తిక్కవానిపాలెం గ్రామానికి చెందిన మత్స్యకారుడు చేపల మసేను, (45) సహచరులతో కలిసి శనివారం ఉదయం సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. వేట కొనసాగుతున్న సమయంలో ఆకస్మికంగా రాకాసి అలలు ఎగసి పడడంతో ఆయన ప్రయాణిస్తున్న ఫైబర్ పడవ అదుపు తప్పింది. ఆ ఘటనలో అమ్మోరు సముద్ర అలల్లో కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. అతనితో ఉన్న మిగతా మత్స్యకారులు తక్షణమే సురక్షితంగా ఒడ్డుకు చేరుకోగలిగారు. గల్లంతైన మత్స్యకారుని కోసం గ్రామ మత్స్యకారులు పడవలతో సముద్రంలో శ్రమిస్తూ వెతుకుతున్నారు. వలలు వేసి ఒడ్డుకు లాగే ప్రయత్నాలు కూడా కొనసాగుతున్నప్పటికీ ఆయన ఆచూకీ తెలియలేదు. సమాచారం అందుకున్న జనసేన పరవాడ మండలం ఇన్‌ఛార్జి పంచకర్ల ప్రసాద్, ఎపి సాంప్రదాయ మత్స్యకార కులాల సంక్షేమ సంఘాల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల ముత్యాలు, తిక్కవారిపాలెం సర్పంచ్ చేపల మసేను, జనసేన జిల్లా కార్యదర్శి బుగిడి రామగోవిందరావు, ముత్యాలంపాలెం-2 ఎంపీటీసీ బంగారు రాజు, మత్స్యకార నాయకులు సూరాడు ఎర్రయ్య, సురాడ ముత్యాలరావు, సొరాడ చంద్రయ్య తదితరులు గల్లంతైన మత్స్యకారుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. సంబంధిత పోలీసు, రెవెన్యూ శాఖాధికారులకు సమాచారం అందజేయగా, గల్లంతైన మత్స్యకారుని ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.



విషాదంలో ఉన్న తిక్కవానిపాలెం గ్రామస్తులు

జాతీయస్థాయి అథ్లెటిక్స్‌కు రేంజర్స్ విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-సబ్బవరం : జాతీయస్థాయి అథ్లెటిక్స్‌కు మండలంలోని రేంజర్స్ జూనియర్ కాలేజీ, డిఫెన్స్ అకాడమీకి చెందిన విద్యార్థి ఎంపికైనట్లు ఆ కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ పోతల సత్యనారాయణ తెలిపారు. తమ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఎంపిసి చదువుతున్న సిహెచ్.కిరణ్ సాయి ఈనెల 22, 23 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు పెద్దవీధి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో అథ్లెటిక్స్ అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా క్రీడల్లో పాల్గొని విజయం సాధించినట్లు తెలిపారు. కిరణ్ సాయి అథ్లెటిక్స్ రన్నింగ్ 100 మీటర్ల పరుగు పందెంలో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం, 200 మీటర్ల పరుగు పందెంలో రాష్ట్రస్థాయిలో గోల్డ్ మెడల్, 4x100 రిలే పరుగు పందెంలో సిల్వర్ మెడల్ కైవసం చేసుకుని జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. అలాగే తమ కళాశాల విద్యార్థులు ఎ.ధనరాజ్కి 1600 మీటర్ల పరుగు పందెంలో రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో నిలిచి పతకాన్ని సాధించినట్లు తెలిపారు. కిరణ్ సాయి నవంబర్ 26 నుండి 30 వరకు హర్యానాలో జరుగుతున్న పోటీలలో పాల్గొంటారని వెల్లడించారు. ఈ సందర్భంగా కిరణ్ సాయి మాట్లాడుతూ స్పోర్ట్స్ కోటాలో మంచి ఉద్యోగం సాధించి భారతదేశానికి పేరు ప్రఖ్యాతలను తీసుకురావడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కిరణ్ సాయిని రేంజర్స్ జూనియర్ కాలేజీ డైరెక్టర్ సూర్య ప్రకాష్, కరస్పాండెంట్ పోతల శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ లగుడు శ్రీను, మోహనరావు, సుమిత్ర, సుబ్రహ్మణ్యం కాలేజీ సిబ్బంది అభినందించారు.



ఎంపికైన కిరణ్‌సాయి

త్వరలో మంచినీటి పథకానికి రూ.125 కోట్లతో టెండర్లు

ప్రజాశక్తి-యలమంచిలి : యలమంచిలి మున్సిపాలిటీలో ఇంటింటికీ 24 గంటలూ మంచినీరు అందించే ఎఐఐ ప్రాజెక్టు రూ.125 కోట్ల పథకానికి త్వరలోనే టెండర్లు పిలవబోతున్నట్లు రాష్ట్ర ఇంజనీర్ ఇన్ చీఫ్ ప్రభాకరరావు వెల్లడించారు. మున్సిపాలిటీకి నీరందించే దార్వపూడి పరిసరాల్లోని వరహానది ఇందేశమ్మవాక ప్రాంతాన్ని ఆయన శనివారం పరిశీలించారు. త్వరలోనే టెండర్లకు సిద్ధం కావాలని కిందిస్థాయి అధికార్లకు ఆదేశాలు జారీ చేశారు. నీటి సోర్స్, నిల్వ చేయడం, పంపింగ్, ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మాణం పట్ల ఇప్పటికే సాంకేతిక అంశాలు రూపొందించారు. టెండర్ల ప్రక్రియ పూర్తయితే రానున్న 30 ఏళ్లవరకూ మున్సిపాలిటీ ప్రతి ఇంటికీ మంచినీటి సరఫరాలో ఎటువంటి ఆటంకం ఉండదని మున్సిపల్ ఏఈ నానాజీ తెలిపారు. ఈ భారీ ప్రాజెక్టు అమలుకు ఎమ్మెల్యే విజయకుమార్ ఇటీవలే సమీక్ష నిర్వహించి మార్గనిర్దేశం చేశారని నానాజీ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ కామేశ్వరరావు, ఈఈ దక్షిణామూర్తి, డిఈ మహేష్, ఏఈ అప్పారావు పాల్గొన్నారు.



ఇందేశమ్మవాక వద్ద నీటి వనరులను పరిశీలిస్తున్న ఎఐఐపి అధికారులు

అధ్వానంగా అప్రోచ్ రోడ్డు

- జారిపడుతున్న ద్విచక్ర వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-కోటవురట్ల : మండలంలోని జల్లూరు వంతెన వద్ద అప్రోచ్ రోడ్డు అధ్వానంగా మారింది. ఇక్కడ వంతెన నిర్మాణం అసంపూర్తిగా వదిలేయడంతో కురుస్తున్న వర్షాలకు అప్రోచ్ రోడ్డుపై వాహనదారులు జారి పడిపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలో అప్రోచ్ రోడ్డుకు మట్టి కప్పి వదిలేశారు. అయితే వర్షాలు కురిసేటప్పుడు వాహనదారులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. పలుమార్లు ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. అప్రోచ్ రోడ్డుకు వేసిన మట్టి బ్రిడ్జి పైకి చేరుకొని బ్రిడ్జిపై కురిసే వర్షపు నీరు కిందకు పోయేందుకు ఏర్పాటు చేసిన రంధ్రాలు సైతం మట్టితో మూసుకుపోయాయి. దీంతో బ్రిడ్జిపై కురిసిన వర్షపు నీరు కూడా అప్రోచ్ రోడ్డు పైనుంచి ప్రవహిస్తూ ఉండడంతో సమస్య మరింత తీవ్రమవుతుంది. ప్రధానంగా రాత్రి సమయంలో ప్రయాణించే వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం పట్ల మండల వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి అప్రోచ్ రోడ్డు పూర్తి స్థాయిలో నిర్మాణం చేపట్టాలని కోరుకుంటున్నారు.



గోతుల్లో వర్షపునీరు చేరి బురదమయంగా ఉన్న అప్రోచ్ రోడ్డు

బల్క్ డ్రగ్ పరిశ్రమలు పెట్టొద్దు : సిఐటియు

ప్రజాశక్తి-పరవాడ

నక్కపల్లి మండలం రాజయ్యపేటలో బల్క్ డ్రగ్స్ పరిశ్రమలు పెట్టొద్దని సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ బల్క్ డ్రగ్స్ పార్కుకు వ్యతిరేకంగా రాజయ్యపేట మత్స్యకారులు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలు సమంజసమైనవని పేర్కొన్నారు. రాజ్యయ్యపేట గ్రామానికి దగ్గరలో ఉన్న హెటిరో డ్రగ్స్ కంపెనీ పరిసర ప్రాంతాల్లో వెదజల్లుతున్న కాలుష్యం గురించి ప్రజలు ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చినా స్పందించకపోతే వారు జాతీయ హరిత ట్రిబ్యునల్‌ను ఆశ్రయించవలసి వచ్చిందని గుర్తు చేశారు. మత్స్యకారుల జీవితాలకు హాని కలిగించే ప్రాజెక్టుల విషయంలో, వారి ఉద్దేశాలను, అభ్యంతరాలను వ్యక్తపరిచే ప్రాథమిక హక్కు, రాజ్యాంగంలో 21వ ఆర్టికల్ ప్రకారం ఉందని, ఆ విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాజయ్యపేట మత్స్యకారుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం బల్క్ డ్రగ్స్ పార్కు ప్రతిపాదన విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

వడ్డాదిలో రూ.11 లక్షల నీటి తీరువా బకాయి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

మండలంలోని వడ్డాది పంచాయతీ పరిధిలో రూ.11లక్షల మేరకు నీటి తీరువా వసూలు కావలసి ఉందని బుచ్చయ్యపేట తహసీల్దార్ ఎం.లక్ష్మీ శనివారం తెలిపారు. నీటి తీరువా వసూలుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నప్పటికీ రైతులను ఒత్తిడి చేయలేదన్నారు. రైతులు ఒకేసారి కాకుండా విడతల వారీగా కూడా నీటి తీరుగా పన్ను చెల్లించవచ్చని చెప్పారు. వడ్డాదిలో ఇనాం భూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తున్నారు. ప్రస్తుతం పి.భీమవరం, నిమ్మలోవలలో రీ సర్వే జరుగుతుందని తెలిపారు.

'గ్రామ జ్యోతి' ఆధ్వర్యాన పలు సేవలు

యువత భాగస్వామ్యంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్న 23వ వార్డు కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్

2021 సంవత్సరంలో జరిగిన యలమంచిలి మున్సిపాలిటీ ఎన్నికల్లో టిడిపి తరుపున 23వ వార్డు నుండి గెలిచిన ఆ పార్టీ ఏకైక కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ తమ గ్రామం కొక్కిరాపల్లి పరిధిలో గ్రామ జ్యోతి యూత్ వెల్ఫేర్ సొసైటీ అనే సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలను అనుసరించి స్థానిక యువతను భాగస్వామ్యం చేస్తూ గ్రామ ప్రజలకు చేస్తున్న నిస్వార్ధమైన సేవలు గురించి రామకృష్ణ ప్రజాశక్తికి తెలియజేశారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే....

నేను కౌన్సిలర్‌గా గెలిచిన నాటికి పార్టీ అధికారంలో లేకపోవడంతో ప్రజలకు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి ఏర్పడింది. ఈ సమయంలో నా కుటుంబ సభ్యునిగా ఆదరిస్తున్న ఒక ప్రభుత్వ ఉద్యోగి సలహా మేరకు జాతీయ యువజన దినోత్సవం, గాంధీ జయంతి, పర్యావరణ పరిరక్షణ దినోత్సవం ఇలా పలు దినోత్సవాలు సందర్భంగా మొక్కలు నాటాలని నిర్ణయించుకున్నాను. ఈ నిర్ణయాన్ని ఆచరణలో పెడుతూ 2022 జనవరి 12న స్వామి వివేకానంద జయంతి (జాతీయ యువజన దినోత్సవం) సందర్భంగా మాజీ పార్లమెంట్ సభ్యులు పప్పల చలపతిరావు చేతుల మీదుగా శ్రీనూకంబిక చెరువు గట్టు వద్ద మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాం. ఆనాటి నుండి ప్రతి ఏటా ఆయా దినాల్లో మొక్కలు నాటే కార్యక్రమాలు చేస్తున్నాం. అలాగే కొత్తగా పెళ్లి చేసుకున్న సందర్భంగా, పిల్లల పుట్టిన రోజు వేడుకల సమయంలో మొక్కలు నాటుతున్నాం. అలా నాటిన మొక్కలు నుంచి బుడమేరు వరద బాధితులకు రూ.78వేలు సహాయ నిధి అందించాం. అరటి మొక్కలు నుండి కాసే అరటి కాయలు అమ్మి వాటిని గ్రామ జ్యోతి యూత్ వెల్ఫేర్ సొసైటీకి జమ చేయడం జరిగింది.



కౌన్సిలర్ రామకృష్ణ

ఆ రోజు ఇద్దరు ముగ్గురుతో మొదలైన గ్రామ జ్యోతి యువత సొసైటీ సేవల్లో నేడు దాదాపు 50 మంది భాగస్వామ్యం అవుతున్నారు. ఈ 50 మంది యువతీ యువకులతో ప్రతి ఆదివారం ఉదయం 6.30 నుండి 8.30 గంటలకు వరకు గ్రామంలో పరిశుభ్రతకు, పర్యావరణ పరిరక్షణకు శ్రమదానం కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. గ్రామంలో రోడ్డుపై పడిన గుంతలను పూడ్చుతున్నాం. ఈ శ్రమదానం కార్యక్రమాలకు కావాల్సిన పనిముట్లు, సేఫ్టీ షూలు, గ్లౌజ్‌లు మా తమ్ముడు మజ్జి శివకృష్ణ - పావని (ఎన్ఆర్ఐ) దంపతులు అందిస్తున్నారు. పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నాం. ప్రతి ఏటా 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీలో ఉత్తమ విద్యార్థులను గుర్తించి వారికి నగదు బహుమతులు అందిస్తున్నాం. ప్రతి ఏటా ఆగష్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గ్రామంలో ఉన్న యువతీ యువకులకు ఆటలు పోటీలు నిర్వహించి, ఉన్నతాధికారుల చేతులు మీదుగా బహుమతుల ప్రదానం చేస్తున్నాం.



మొక్క నాటుతున్న మాజీ ఎంపీ పప్పల చలపతిరావు

యువత అభివృద్ధి కోసం మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, గ్రామ పెద్దలు సహకారంతో గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు చేశాం. కాంపిటేటివ్ పరీక్షలకు వెళ్లే వారికి ఉపయోగపడే పుస్తకాలు ఈ లైబ్రరీలో అందుబాటులో ఉంచుతున్నాం. గ్రామ జ్యోతి యువత చేపట్టే కార్యక్రమాల ద్వారా ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం. మా సంస్థ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలే కాకుండా వార్డు అభివృద్ధికి ప్రభుత్వం నుండి సహాయం అందిస్తే ఉత్తమ వార్డుగా తీర్చిదిద్దుతామని తెలియజేస్తున్నాను.

రేపు పిజిఆర్ఎస్ రద్దు

ప్రజాశక్తి-అనకాపల్లి : బంగాళాఖాతంలో మొంథా తుఫాన్ ఏర్పడిన కారణంగా వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో ఈనెల 27వ తేదీన నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)ను రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తుఫాను కారణంగా 27, 28 తేదీలలో అతి భారీ వర్షాలు, గాలులు ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలు ఇబ్బంది పడకుండా ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా 27న పిజిఆర్ఎస్ రద్దు చేశామని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ భూముల్లో నాటిన మొక్కలు తొలగింపు

- హెచ్చరిక బోర్డులు ఏర్పాటు
- ఆక్రమణలకు దిగితే కఠిన చర్యలు : తహశీల్దారు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని పోలేపల్లి రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూములను ఆక్రమించి నాటిన మొక్కలను రెవెన్యూ అధికారులు, సిబ్బంది శనివారం తొలగించారు. పోలేపల్లి రెవెన్యూ సర్వేనెంబర్ 156లో రోడ్డుకి ఆనుకొని 216 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, ఇటీవల స్థానికంగా ఉన్న టిడిపి నేతలు, ప్రజా ప్రతినిధులు జెసిబిలతో ఆ భూములను చదును చేయించి, యూకలిప్టస్ మొక్కలను వేశారు. దీనిపై స్థానిక సర్పంచ్ సీతా పైడినాయుడు ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజుకు, స్థానిక తహసీల్దార్ ఎం.లక్ష్మికి ఫిర్యాదు చేశారు. శుక్రవారం బుచ్చయ్యపేటలో జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఈ విషయాన్ని ప్రస్తావించారు. రూ.100కోట్ల విలువైన ప్రభుత్వ భూములను టిడిపి నేతలు ఆక్రమించుకోవడంపై ప్రజాప్రతినిధులు ధ్వజమెత్తారు. ఈ నేపథ్యంలో తహశీల్దార్ ఎం.లక్ష్మి, ఆర్ఐ శ్రీనివాసరావు, వీఆర్వో తరుణ్, రెవెన్యూ సిబ్బందితో శనివారం ఈ భూముల్లోకి వెళ్లి నాటిన మొక్కలను తొలగించారు. అవి ప్రభుత్వ భూములుగా పేర్కొంటూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. పోలేపల్లిలోని 156 సర్వే నెంబరు భూములన్నీ ప్రభుత్వ భూములేనని, ఈ భూముల్లో ఎవరైనా ఆక్రమణకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తమ స్థానిక రెవెన్యూ సిబ్బందిని దీనిపై అప్రమత్తం చేశామన్నారు.



మొక్కలు తొలగించి హెచ్చరిక బోర్డు పెట్టిన రెవెన్యూ అధికారులు

ఐఇఇఇ ఎక్స్‌ట్రీమ్-19.0లో డైట్ విద్యార్థుల భాగస్వామ్యం

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రపంచవ్యాప్తంగా జరిగే ఐఈఈఈ ఎక్స్‌ట్రీమ్ 19.0 పేరుతో 24 గంటల ప్రోగ్రామింగ్ కాంపిటీషన్‌లో స్థానిక దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ అటానమస్ కళాశాల విద్యార్థులు భాగస్వాములయ్యారు. ఈ నెల 25న ప్రారంభమై, 26న ఇది ముగుస్తుంది. ఈ గ్లోబల్ కోడింగ్ కాంటెస్ట్‌లో మొత్తం 194 మంది విద్యార్థులు, 64 జట్లు, 9 మంది ప్రొక్టర్లు పాల్గొన్నారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న ఈ పోటీలో డైట్ గ్లోబల్ పార్టిసిపేషన్ క్యాటగిరీలో 10వ స్థానం సాధించడం విశేషం. ఈ ప్రతిష్ఠాత్మక పోటీలో పాల్గొన్న విద్యార్థులు 24 గంటలపాటు నిరంతరం సవాళ్లను స్వీకరిస్తూ తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ తమ విద్యార్థులు ప్రపంచ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరుస్తుండటం గర్వకారణమన్నారు. ఇలాంటి గ్లోబల్ కాంటెస్టులు విద్యార్థులలో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించడమే కాక, టీమ్ వర్క్ సృజనాత్మకతకు వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ వైకుంఠ రావు మాట్లాడుతూ, "డైట్ ఐ ఈ ఈ ఈ స్టూడెంట్ బ్రాంచ్ కృషి ఫలితంగా విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటుతున్నారని, ఇది తమ విద్యార్థుల కఠోర శ్రమకు, ఫ్యాకల్టీ మార్గదర్శకతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఐఈఈఈ స్టూడెంట్ బ్రాంచ్ కన్వీనర్ ఏ కృష్ణనాగ్ మాట్లాడుతూ ఐఈఈఈ ఎక్స్‌ట్రీమ్ వంటి పోటీలు విద్యార్థులకు ప్రాక్టికల్ లెర్నింగ్ గ్లోబల్ ఎక్స్‌పోజర్ ఇవ్వడంలో ఎంతో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు, ప్రొక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

బంగారమ్మపాలెంలో బస్సులు నిలుపుదల చేయాలి

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని బంగారమ్మ పాలెం గ్రామంలో దేవాదాయశాఖకు చెందిన చారిత్రాత్మక పుణ్యక్షేత్రం శ్రీసోమలింగేశ్వర స్వామి ఆలయానికి ప్రతిరోజూ వందలాది మంది భక్తులు వస్తున్నారని, అయితే ఆలయానికి సమీపంలో బంగారమ్మ పాలెం బస్‌స్టాప్ వద్ద ఆర్టీసీ బస్సులు నిలుపుదల చేయకపోవడంతో వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆ గ్రామ సర్పంచ్ దాడి లావణ్య కన్నం నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి రోజూ, ముఖ్యంగా సోమవారం, పౌర్ణమి రోజులలో వందలాది మంది భక్తులు ఆలయానికి వస్తున్నారు. కానీ ఆర్టీసీ బస్సులు బంగారమ్మ పాలెం బస్‌స్టాప్ వద్ద ఆగకపోవడం వల్ల దూర ప్రాంతాల నుండి వచ్చిన వారు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఈ విషయమై ఆర్టీసీ అధికారులు వెంటనే చర్యలు తీసుకుని ప్రతి బస్సును బంగారమ్మ పాలెం బస్‌స్టాప్ వద్ద నిలిపేలా తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

ఇవిఎం గోదాము తనిఖీ

ప్రజాశక్తి-అనకాపల్లి : ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్) గోదాము వద్ద సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యన్నారాయణరావు సిబ్బందిని ఆదేశించారు. మాసంతపు తనిఖీలో భాగంగా శనివారం జిల్లా ఎస్‌పి కార్యాలయం ప్రాంగణంలో ఉన్న ఈవీఎం గోదామును వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. ఈవీఎం గోదాము వద్ద పరిస్థితులను, సీసీ కెమెరాల పనితీరును, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. భద్రతా ప్రమాణాలపై అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. భద్రతా ప్రమాణాలు, లాగ్ బుక్ నిర్వహణ ఇతర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో డిఆర్వో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల విభాగం పర్యవేక్షకులు, ఉప తహసీల్దార్ ఎస్‌విఎస్ వాసు నాయుడు, షేక్ ముజీబ్, అనకాపల్లి అగ్ని మాపక స్టేషన్ ఫైర్ ఆఫీసర్, పి.నాగేశ్వరరావు, టిడిపి, వైసిపి, కాంగ్రెస్, ఆప్ పార్టీల ప్రతినిధులు బొలిశెట్టి శ్రీనివాసరావు, కోన ఉమా మహేశ్వరరావు, మీసాల సుబ్బన్న, కె.హరినాథ్ బాబు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.


ఇవిఎం గోదాము వద్ద అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు

ఓటరు జాబితాపై అభ్యంతరాలుంటే తెలిపాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఓటరు జాబితాలో మార్పులు చేర్పులపై అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని జిల్లా రెవిన్యూ అధికారి వై సత్యన్నారాయణరావు రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. కలెక్టరేట్లోని తన ఛాంబర్‌లో శనివారం వివిధ రాజకీయ పార్టీల నేతలతో మాసాంతపు సమావేశాన్ని డిఆర్వో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలోని సమస్యలను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్లాలనే లక్ష్యంతోనే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు కొత్తగా ఓటరు నమోదు కొరకు, ఓటరు తొలగింపు కొరకు, ఓటరు ఐడి కార్డు సవరణల కొరకు 1483 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిలో 1163 దరఖాస్తులు పరిష్కరించామని చెప్పారు. ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారుల వద్ద 320 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయన్నారు. పోలింగ్ కేంద్రాల్లో బూత్ స్థాయి ఏజెంట్లను నియమించాలని డిఆర్‌ఓ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ఎస్‌విఎస్ వాసు నాయుడు, ఉప తహసీల్దార్ షేక్ ముజీబ్, టిడిపి, వైస్సార్సీపీ, కాంగ్రెస్, ఆప్ పార్టీల ప్రతినిధులు బొలిశెట్టి శ్రీనివాస రావు, కోన ఉమా మహేశ్వరరావు, మీసాల సుబ్బన్న, కె.హరినాథ్ బాబు, పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడో విడత అడ్మిషన్లు

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడవ విడత డిగ్రీ అడ్మిషన్ల ప్రారంభమవుతున్నాయని ప్రిన్సిపల్ కిరణ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 25, 26 తేదీలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఈనెల 28, 29 తేదీలలో ఆప్షన్స్ ఎంపిక చేసుకోవాలని సూచించారు. కళాశాలలో కూడా రిజిస్ట్రేషన్ అడ్మిషన్ల జరుగుతాయని, ఐక్యూఎసి సమన్వయకర్త డాక్టర్ నారాయణ మూర్తి 8247470250 , డాక్టర్ మల్లిబాబు 9966545448 నెంబర్లకు సంప్రదించాలని కోరారు. బీఏ, బీకాం, బీఎస్సీ జువాలజీ, కెమిస్ట్రీ కోర్సులలో ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు.

ఆకట్టుకున్న నేల వేషాలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో గౌరీ పరమేశ్వరుల ఆలయ ఆవరణలో శనివారం ప్రదర్శించిన నేల వేషాలు ఆకట్టుకున్నాయి. గ్రామ సర్పంచ్ ఎస్ భాగ్యలక్ష్మి బాపు నాయుడు, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గత 15 రోజులుగా నేలవేషాలు ప్రదర్శనలు చేస్తున్నారు. మహిళలు దుర్గ భవాని కోలాట బృందం వారిచే కోలాటం వేస్తున్నారు. నేల వేషాలలో ఎస్.ఆదిబాబు, కె.రాజు, బీశెట్టి రాజు, మొల్లేటి సీతారాం, కర్రి రాము, ఎం శివ, చెరుకూరి వెంకటలక్ష్మి తదితరులు విభిన్న పాత్రలలో నటించి ప్రజలకు హాస్యం పండించి ప్రేక్షకులను మైమరిపిస్తున్నారు. గ్రామస్తులు నటులను అభినందించారు.

వైసిపి మండల కార్యవర్గం నియామకం

ప్రజాశక్తి-సబ్బవరం : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల కార్యవర్గాన్ని పార్టీ అధిష్టానం నియమించింది. ఈ మేరకు పార్టీ పెందుర్తి నియోజకవర్గం ఇంచార్జ్ అన్నంరెడ్డి అదీప్ రాజ్ వైసీపీ కేంద్ర కార్యాలయం నుండి నియమించిన కమిటీ సభ్యులు వివరాలను శనివారం ప్రకటించారు. వైసిపి మండల అధ్యక్షుడుగా కర్రి అప్పలనాయుడు (బాబు), ఉపాధ్యక్షులుగా ఎడ్ల నాయుడు, మచ్చ కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శులుగా గొర్లె ఎర్రినాయుడు, బొడ్డేటి మహాలక్ష్మి నాయుడు, తుంపాల శివ, పిల్లల అప్పల నాయుడు, కార్యదర్శులుగా విరోతి అప్పలనాయుడు, సబ్బవరపు నాగభూషణం, అక్కిరెడ్డి అప్పారావు, గొర్లె వెంకటరమణ, గజ్జి దేముడు ఎంపికయ్యారు. వీరు కాకుండా మరికొంత మంది సభ్యులుగా నియామకమయ్యారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై సంతకాల సేకరణ

ప్రజాశక్తి-పరవాడ : నూతన మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ఆధ్వర్యంలో స్థానిక వైసిపి కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు కోన రామారావు అధ్యక్షతన రచ్చబండ, కోటి సంతకాల కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా వైసిపి పెందుర్తి సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్ రాజు, అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పైల శ్రీనివాసరావు, జెడ్పిటీసీ పిఎస్.రాజు హాజరై మాట్లాడారు. ప్రజా ఆస్తులను బినామీలకు బదిలీ చేయడం దోపిడీ తప్ప మరొకటి కాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు బంధం నాగేశ్వరరావు, బూస అప్పలరాజు, సీనియర్ నాయకులు చుక్కా రామునాయుడు, చల్లా కనకారావు, బొద్దపు చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

తుపాన్ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- మునగపాక : మొంథా తుఫాన్ ప్రభావంతో రానున్న 48 గంటల్లో మండలంలో భారీ వర్షాలు కురిసే ప్రభావం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దారు సత్యనారాయణ, ఎంపీడీవో ఉషారాణి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్ అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. సమాచారం కోసం తహశీల్దారు కార్యాలయం (08924257624), ఎంపిడిఒ కార్యాలయం (08924257659) ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

బుచ్చయ్య పేట : ఈ నెల 26 నుండి 28 వరకు తుఫాను ప్రభావంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల తహసీల్దార్ ఎం.లక్ష్మి సూచించారు. తుఫాను ఇబ్బందులపై బుచ్చయ్య పేట తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, 08934-247857 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

కోటవురట్ల : అల్పపీడనం తుఫానుగా మారుతుందని వాతావరణ శాఖ అధికారుల హెచ్చరిక పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తహశీల్దారు తిరుమల బాబు అన్నారు. ఈ మేరకు శనివారం సిబ్బందితో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామాలలో లోతట్టు ప్రాంతాలను గుర్తించడంతోపాటు పాడుబడిన ఇళ్లలో నివాసముకున్న వాళ్లను అప్రమత్తం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

నక్కపల్లి : రానున్న మూడు రోజులు విస్తారంగా వర్షాలు కురుసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో డి.సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి, తుఫాన్ నేపథ్యంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై సమీక్షించారు. ఎటువంటి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు.


పద్మనాభం : మొంథా తుఫాన్ దూసుకొస్తున్న నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ కె. రూపేష్ సూచించారు. తుఫాన్ ప్రభావంతో ఈనెల 26 నుంచి 29 వరకు భారీ నుండి అతి భారీ వర్షాలు, ఈదురు గాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో అన్ని గ్రామాల్లో ముందు జాగ్రత్తగా ప్రజలకు హెచ్చరికలు చేయాలని పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి ఆదేశించారు. డిప్యూటీ ఎంపిడిఒ రమణ మాట్లాడుతూ, తుఫాన్ నేపథ్యంలో తాగునీరు, విద్యుత్, పరిశుభ్రతపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

రైతాంగానికి వ్యవసాయ వాతావరణ ఆధారిత సూచనలు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా రైతాంగానికి స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ శాఖ రాగల ఐదు రోజులకు వ్యవసాయ వాతావరణ ఆధారిత సూచనలను శనివారం ఒక ప్రకటనలో తెలియజేసింది. వరి పంటలో పొడ తెగులు, గోధుమ రంగు ఆకుమచ్చ తెగులు, అగ్గి తెగులు బ్యాక్టీరియా ఆకుమచ్చ తెగులు సమస్య ఉందని వీటి నివారణకు హెక్సా కొనజోల్ 2 మిల్లీమీటర్లు లేదా ప్రోపి కొనజోల్ ఒక మిల్లీమీటర్ లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. అగ్గి తెగులకు ట్రైసైక్లోజోల్ 0.6మిల్లి లీటర్లు లేదా ఐసో ప్రోథయోలిన్ 1.5 మిల్లీలీటర్లు, అలాగే బ్యాక్టీరియా ఆకు మచ్చ తెగులు నివారణకు కాపర్ హైడ్రాక్సైడ్ 30 గ్రాములు, స్ట్రెప్టోసైక్లిన్ ఒక గ్రాము 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని తెలిపారు. సుడిదోమ నివారణకు అసిఫేట్ 1.5 గ్రాములు ఉధృతి ఎక్కువగా ఉంటే పై మెట్రోజిన్ 0.6 గ్రాములు లేదా డైనోటెఫ్యురాన్ 0.4 గ్రాములు లీటరు నీటిని చొప్పున కలిపి పిచికారి చేయాలన్నారు. కాండం తొలిచే పురుగు ఆకుముడత తెగులు ఆశిస్తే నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ రెండు గ్రాములు రెండు గ్రాములు లేదా అసిఫేటు 1.5 గ్రాములు లీటర్ నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలని తెలియజేశారు. చెరుకులో మొవ్వ కుళ్ళు తెగులు ఆశిస్తే కార్బండజం ఒక గ్రాము లేదా మాన్కో జబ్ మూడు గ్రాములు ఉధృతిను బట్టి పది నుంచి 15 రోజులకు ఒకసారి పిచికారి చేయాలన్నారు. ఉలవ పంటకు అనువైన సమయం కాబట్టి క్రీడా 1-18, ఆర్పిహెచ్జి 9, ఏటిపిహెచ్జి 11 రకాలను ఎకరాకు 8 నుంచి 10 కిలోల విత్తనాలను విత్తన శుద్ధి చేసి వేసుకోవాలన్నారు. జనుము, రబీ మొక్కజొన్న అధిక దిగుబడినిచ్చే హైబ్రిడ్ రకాలను ఎంచుకోవాలని సూచించారు. అధిక దిగుబడినిచ్చే రబీ పెసర ఎల్‌జిజి 460, 600, 607, 630, ఐపీఎం 2-14 ఎకరాకు 15 నుంచి 16 కిలోలు వేసుకోవాలన్నారు. రబీ మినుములో అధిక దిగుబడి నిచ్చే ఎల్బీజీ 752, 884, 904, జిబిజి1, పియు 31 ఎంపిక చేసుకుని ఎకరాకి 18 నుంచి 20 కిలోల విత్తనాలను నాటుకోవాలని సూచించారు.

ఉప్పుటేరులో చేపల మృతిపై మత్స్యకారుల ఆందోళన

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలో రాజయ్యపేట ఉప్పుటేరులో తరచూ చేపలు మృతి చెందడంపై మత్స్యకారులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. వర్షం కురిసినప్పుడల్లా హెటిరో కంపెనీ వ్యర్థ రసాయన జలాలు ఉప్పుటేరులో వదలడంతో చేపలు చనిపోతున్నాయని మత్స్యకారులు ఆరోపించారు. గురువారం రాత్రి కురిసిన వర్షానికి కంపెనీ వ్యర్థ రసాయన జలాలు ఉప్పుటేరులో వదలడంతో చేపలు చనిపోయాయని, శుక్రవారం గ్రామానికి వచ్చిన కలెక్టర్ విజయ కృష్ణన్ దృష్టికి మత్స్యకారులు తీసుకువెళ్లారు. చేపలు మృత్యువాత పడ్డ వీడియోను ఆమెకు చూపించారు. ఉప్పుటేరులో ఇప్పటికే అనేకసార్లు చేపలు మృత్యువాత పడ్డాయని, కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి ఫలితం లేదని మత్స్యకారులు ఆవేదన వెలిబుచ్చారు. తుఫాన్ సమయంలో సముద్రంలో వేటకు వెళ్లే అవకాశం లేనప్పుడు పలువురు మత్స్యకారులు ఉప్పుటేరులో చేపల వేట చేసుకునేవారమని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని వాపోయారు. ఉప్పుటేరులో నీరు తాగి ఆవులు కూడా మృత్యువాత పడడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధంగా మత్స్య సంపద నశించిపోతుంటే తమ జీవనం విధానం ఎలా సాగుతుందని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉప్పుటేరు కలుషితం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని మత్స్యకారులు డిమాండ్ చేశారు.



మృతి చెందిన చేపలు



పనులు ప్రారంభిస్తున్న నాయకులు

రోడ్ల పనులకు శంకుస్థాపనలు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని రోడ్ల నిర్మాణాలకు సంబంధించి స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చొరవతో రూ.2.75కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో దారమఠం, సాలికమల్లవరం, అమ్మపేట, చోద్యం, విప్పలపాలెం రహదారుల అదునీకరణ చేపట్టనున్నారు. ఇందులో భాగంగా ఈ రహదారుల శంకుస్థాపనను మండల టీడీపీ నాయకులు శంకుస్థాపనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల టీడీపీ అద్యక్షులు, మాజీ జెడ్పీటీసీ చిటికెల తారక వేణుగోపాల్ మాట్లాడుతూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు నిరంతరం మండల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. సాలికమల్లవరం రోడ్డుకు రూ.75లక్షలు, దారమఠం రోడ్డుకు రూ.90లక్షలు, అమ్మపేటకు రోడ్డుకు రూ.50లక్షలు, గాదంపాలెం రోడ్డుకు రూ.60లక్షలతో నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశామన్నారు. నర్సీపట్నం నియోజకవర్గంలో 9రోడ్లకు రూ.6.55కోట్లు నిధులు మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు, చోద్యం సర్పంచ్ ఆదపురెడ్డి గోపాలకృష్ణ(గోపి), చోద్యం కోఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ చిటికెల సాంబమూర్తి, జోగుంపేట మాజీ సర్పంచ్ సుర్ల సీతారామ్మూర్తి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి కృషి

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలో జానకిరాంపురం కోపరేటివ్ సొసైటీ ఏర్పాటు చేసి 40 ఏళ్ళ పూర్తయినా ఇప్పటికీ అద్దె భవనంలోనే కొనసాగుతుందని, ఈ భవన నిర్మాణంనకు తన వంతు కృషి చేస్తానని కోఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ బలిజి మహారాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. ప్రస్తుతం రూ.6కోట్ల టర్నోవర్ అవుతుందని, దీని అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ద్వారా మరింత బలోపేతం చేయనున్నామన్నారు. మహిళలకు రుణాలు అందజేయనున్నామని, బంగారంపై రుణాలు కూడా ఇవ్వడానికి ప్రయత్నం చేస్తామన్నారు. తోటి డైరెక్టర్లతో పాటు సిబ్బందితో కలిసి సొసైటీని అభివృద్ధి చేస్తామన్నారు.

31న కోటి దీపోత్సవం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: నర్సీపట్నంలో ఈ నెల 31న శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సమక్షంలో కార్తిక దీపోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు కార్తీక దీపోత్సవం కమిటీ సభ్యులు నాగేంద్ర రాజు తెలిపారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లలో భాగంగా ఆయన కమిటీ సభ్యులతో కలిసి శనివారం శివపురంలోని ఫారెస్ట్ ఆఫీస్ వద్ద ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల మైదానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నాగేంద్ర రాజు మాట్లాడుతూ, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. నవంబర్ 3వ తేదీన ఎన్టీఆర్ స్టేడియంలో శ్రీనివాస కళ్యాణం కూడా జరగనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రుత్తల కృష్ణ, పైల గోవింద్, రాజ్ కుమార్, చింటూ, కోరుప్రోలు శ్రీను, రాజా, బుజ్జి పాల్గొన్నారు.

ఘనంగా నాగుల చవితి వేడుకలు

కుటుంబీకులతో స్పీకర్ అయ్యన్న పూజలు



పూజలు చేస్తున్న అయ్యన్న

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్ :ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు శనివారం నర్సీపట్నంలో కుటుంబ సభ్యులతో నాగులచవితి పండుగ జరుపుకున్నారు. వైసిపి రాష్ట్ర కార్యదర్శి చింతకాయల సన్యాసి పాత్రుడు తమ కుటుంబ సభ్యులతోనూ, జనసేన పార్టీ సమన్వయకర్త రాజన్న సూర్య చంద్ర నాగులచవితి పండుగ సందర్భముగా పుట్టలో పాలు పోసి పూజలు నిర్వహించారు.

సందర్శకులతో జూపార్కు, కంబాలకొండ కిటకిట

ఆరిలోవ : నాగులచవితి పూజలకు నగరంలోని జూ పార్కు, కంబాల కొండ, ముడసర్లోవ పార్కులు భక్తులు, సందర్శకులతో కిటకిటలాడాయి. జూ పార్కులో ఉదయం 7.30 గంటల నుంచే సందర్శకులకు ప్రవేశం కల్పించారు.కంబాల కొండ, ముడసర్లోవ పార్కులో కూడా ఎక్కువ సంఖ్యలో పుట్టలు ఉండడంతో కుటుంబాలతో నగరవాసులు వచ్చి పూజలు చేశారు. అక్కడే భోజనాలు చేసి, సాయంత్రం వరకు సరదాగాగడిపారు.

జూ పార్కు ఒక్క రోజు ఆదాయం రూ.7.60 లక్షలు

నాగుల చవితిని పురస్కరించుకొని ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాలను శనివారం ఒక్క రోజు 9,664 మంది సందర్శకులు సందర్శించారు. వీరి నుంచి రూ 7.60 లక్షలు ఆదాయం సమకూరినట్టు జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. అదేవిధంగా కంబాల కొండ పార్కును 4 వేల మంది సందర్శించా, రూ 2.67 లక్షలు ఆదాయం వచ్చినట్టు అటవీశాఖ అధికారులు తెలిపారు.

పెందుర్తి : జివిఎంసి 97వ వార్డు శ్రీలక్ష్మి నగర్ (కిషోర్ లేఔట్)లో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు కుటుంబ సమేతంగా నాగులచవితి పూజల్లో పాల్గొన్నారు.

పద్మనాభం.: నాగుల చవితి సందర్భంగా పుట్ట పూజల్లో పాల్గొన్న భక్తులు తర్వాత అనంతపద్మనాభస్వామి ఆలయ ప్రాంగణంలోని కుంతి మాధవ స్వామి ఆలయంలో పూజలు చేశారు.

ఎలమంచిలి టౌన్ : పట్టణంలోని నాగేంద్ర కాలనీలో నాగేంద్ర స్వామి ఆలయానికి నాగులచవితి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి పుట్టలో గుడ్లు, పాలు పోసి నాగేంద్రునికి పూజలు చేశారు. ఆలయ కమిటీ వారు భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

అనకాపల్లి రూరల్ : నాగుల చవితి సందర్భంగా ఎన్టీఆర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో వెలసిన శ్రీనాగ దుర్గమ్మ దేవి ఆలయంలో మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీశ్వరరావు పూజలు చేశారు. అనంతరం నాగ జగదీష్‌ను దేవస్థానం కమిటీ సభ్యులు శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో బుద్ధ నాగేశ్వరరావు, పెంటకోట శ్రీనివాసరావు, సూరిశెట్టి బల్లమ్మ, దొడ్డి రాము పాల్గొన్నారు.



అనకాపల్లిలో పూజలు చేస్తున్న బుద్ద



స్వీటును తినిపిస్తున్న నాయకులు

ఘనంగా కొండనాయుడు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-రావికమతం: టిడిపి మండల మాజీ అధ్యక్షుడు రాజాన కొండనాయుడు జన్మదిన వేడుకలు శనివారం మండలంలోని టి.అర్జాపురం స్వగ్రామంలో వేడుకలను నిర్వహించారు. మండలంలో 28 గ్రామ పంచాయతీల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,అభిమానులు, శ్రేయోభిలాషులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు జన్మదిన వేడుకల్లో పాల్గొని ఘనంగా సత్కరించడం పట్ల ఎంతో ఆనందంగా ఉందన్నారు.

బుడ్డిబందలో వీధి దీపాలు ఏర్పాటు

ప్రజాశక్తి-రావికమతం:మండలంలోని కవగుంట పంచాయతీ శివారు బుడ్డిబంద గ్రామంలో సర్పంచ్ దాసరి సూర్యకుమారి, ఉప సర్పంచ్ కిముడు గంగాభవాని, కార్యదర్శి రాజబాబు ఆధ్వర్యంలో శనివారం విద్యుత్తు స్తంభాలకు బల్బులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు బల్బులు పూర్తిగా పాడైపోయాయన్నారు. చీకట్లో అసౌకర్యానికి గురికాకుండా గ్రామంలో అన్ని స్తంభాలకు బల్బులను వేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డ్ మెంబర్ గుళ్ళ బాబ్జి, ఎలక్ట్రీషియన్లు షేక్ వెంకటి, రబ్బా భాస్కరరావు తదితరులు ఉన్నారు.



లైటును ఏర్పాటు చేస్తున్న సిబ్బంది



పరిశీలిస్తున్న ఎంపిడిఓ

డ్రైయినేజీ పనుల పరిశీలన

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో దేవవరం గ్రామ పంచాయతీ శివారు చిన రామభద్రపురంలో డ్రైనేజీ పై పిజిఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం ఎంపీడీవో డి సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు పరిశీలించారు. ఇందుకు సంబంధించిన ఫిర్యాదు పై విచారణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆనకట్టు ఆధునీకరణ చేసేదెన్నడో?

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని విప్పలపాలెం ఆనకట్టు ఆధునికీరణ మూడు దశాబ్దాలుగా హామీగానే మిగిలిపోయింది. తొలుత తక్కువ ఎత్తులో నిర్మించిన ఆనకట్టుకు ఇప్పుడు వరద పోటు అధికమైంది. కొయ్యూరు, జీకేవీధి, చింతపల్లి మండలాల కొండ ప్రాంతంలో కురుస్తున్న వర్షం బొడ్డేరు గెడ్డ ద్వారా ఆనకట్టులో చేరుతుంది. ఇక్కడ ఆనకట్ట ఎత్తు తక్కువ కావడం, ప్రధాన కాలువలు వెడల్పు, లోతు చేపట్టక పోవడంతో ఆనకట్టుపై ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు తాండవ జలాశయంలోకి వృధాగా పోతోంది. ఆనకట్టు దిగువ 1600 ఆయకట్టు ఉంది. ఆధునీకరణ పనులు చేపట్టి ఆనకట్టు ఎత్తు పెంచితే ఈ భూములకు పుష్కలంగా నీరందుతుందని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా ఆయకట్టు ఆధునీకరణ చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



వృథాగా పోతున్న నీరు



కోలాటం ఆడుతున్న మహిళలు

ఉత్సాహంగా కోలాటం పోటీలు

ప్రజాశక్తి - చీడికాడ: నాగుల చవితి సందర్భంగా చీడికాడ, మండలంలో వివిధ గ్రామాల్లో కోలాటం పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. చీడికాడ మండలంలో కేంద్రంలో కామిరెడ్డి వారి కల్లాలు, పరదేశమ్మ తల్లి యూత్ ఆధ్వర్యంలో కోలాటం పోటీలలో పది గ్రూపులు తరలి వచ్చాయి. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతగా కామరెడ్డి దేవుడుతో పాటు గ్రామ పెద్దలు వ్యవహరించారు. అనంతరం గెలుపొందిన మూడు గ్రూపులకు బహుమతి నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువత పాల్గొన్నారు.



క్రీడాకారిణిలతో కోచ్

జాతీయ స్థాయి పోటీలకు బాలికలు

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్: జమ్మూ కాశ్మీర్‌లో జరగనున్న జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ ఉషు ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనడానికి నర్సీపట్నం నుండి ముగ్గురు బాలికలు శనివారం బయలుదేరారు. ఇటీవల జరిగిన అండర్-17 బాలికల స్టేట్ ఉషు టోర్నమెంట్‌లో 3 స్వర్ణపతకాలు గెలుచుకున్న ఈ ముగ్గురు క్రీడాకారిణులు ఆంధ్రప్రదేశ్ అండర్-17 బాలికల టీమ్ తరఫున జాతీయ స్థాయిలో పోటీ పడనున్నారు. జెడ్‌పిహెచ్ గర్ల్స్ హైస్కూల్‌లో 9వ తరగతి విద్యార్థిని సకిరెడ్డి హరిణి (70 కేజీల బాక్సింగ్ విభాగం)బి.ఆర్. అంబేద్కర్ సోషల్ వెల్ఫేర్ పాఠశాల విద్యార్థినులు లండ ఐశ్వర్య (65 కేజీ), బొమ్మల ప్రేమ జ్యోతి (60 కేజీ)వీరి తోడుగా టీమ్ కోచ్ వేపాడ ప్రియాంక వెళ్లారు. ఈ సందర్భంగా నింజాస్ అకాడమీ బోర్డ్ మెంబర్స్ సుతాపల్లి శ్రావణ్, వెలగా జగన్నాధ్, సుతాపల్లి శ్రీకాంత్, వెలగా నారాయణరావులు మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో కూడా మెడల్స్ సాధించాలని ఆకాంక్షించారు. సీనియర్ కోచ్ శేఖర్, శాప్ కోచ్ అబ్బు మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో మెడల్స్ సాధిస్తే స్పోర్ట్స్ కోటా కింద ప్రత్యేక సదుపాయాలు లభిస్తాయని తెలిపారు.

వైద్య సిబ్బంది సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు ఏజెన్సీలోని క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఏజెన్సీ వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం నేతలు నూతనంగా నియమితులైన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని కోరారు. ఈ మేరకు శనివారం అల్లూరి సీతారామరాజు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని గిరిజన ప్రాంత వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం, జిల్లా అధ్యక్షులు శెట్టి నాగరాజు ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారితో మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో వైద్య ఆరోగ్య సేవలు అందించడంలో భౌగోళికంగా ఉన్న పరిస్థితులు దృష్ట్యా క్షేత్రస్థాయి వైద్యారోగ్య సిబ్బంది కష్టపడి సేవలు అందిస్తూన్నారన్నారు. క్షేత్రస్థాయిలో ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని వాటిని సానుకూలంగా పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.గత ప్రభుత్వ హయాంలో రెగ్యులర్ అయిన 78 మంది హెల్త్ అసిస్టెంట్లు సర్వీస్ రెగ్యులేషన్, పోలీస్ ఎంక్వైరీ ఫైల్ నేటికీ ఓ కొలిక్కి రాలేదన్నారు.కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలన్నారు.

బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుపై

మత్స్యకారుల మనోవేదనను గుర్తించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అప్పలరాజు

ప్రజాశక్తి-ఎస్.రాయవరం: బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుపై మత్స్యకారుల అభిప్రాయాలను గుర్తించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. మండలంలోని ధర్మవరం అగ్రహారంలో శనివారం రాజయ్య పేట మత్స్యకారులు, నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శుక్రవారం ఉదయం రాజయ్య పేటలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ అధ్యక్షత జరిగిన సమావేశంలో రాజయ్య పేట మత్స్యకారులు చెప్పిన అంశాలు, వారి ఆవేదనను పరిగణలోకి తీసుకోవాలన్నారు. హెటిరో డ్రగ్స్ కంపెనీతో జరిగిన నష్టాన్ని, బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటు చేస్తే భవిష్యత్తులో జరిగే నష్టాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని మత్స్యకారుల ఆవేదనను దృష్టిలో తీసుకోవాలని కోరారు. పెదగంట్యాడ ప్రాంతంలో అదానీ అంబుజా సిమెంట్ సిమెంట్ కంపెనీని ప్రజలు వ్యతిరేకించారని, తాము కూడా సిమెంట్ కంపెనీకు వ్యతిరేకం అని, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ గాజువాక ప్రకటించారన్నారు. రాజయ్య పేట గ్రామంలో మత్స్యకారులు చేస్తున్న పోరాటాన్ని రాష్ట్ర హెూం మంత్రి అనిత పరిగణనలోకి తీసుకుని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్లి బల్క్ డ్రగ్స్ పార్క్ రద్దు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.మహేష్ బాబు, జీ.సోమేశ్వరరావు, సోమేష్, మాధవరావు, నానాజీ,సత్తియ్య, వెంకటేష్,గురయ్య, కాశీ రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అప్పలరాజు

పండగ పూటా కొనసాగిన ఆందోళన



ఆందోళన చేపడుతున్న మత్స్యకారులు

ప్రజాశక్తి -నక్కపల్లి: బల్క్ డ్రగ్ ఏర్పాటు చేస్తే తమ జీవితాలు నాశనం అవుతాయని, వెంటనే రద్దు చేయాలని మత్స్యకారులు డిమాండ్ చేశారు. మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్య పేటలో బల్క్ డ్రగ్‌ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత రిలే దీక్షలు శనివారం నాటికి 42 వ రోజుకు చేరుకుంది. నాగుల చవితి (పండగ పూట) కూడా మత్స్యకారులు ఆందోళనను కొనసాగించారు.బల్క్ డ్రగ్ ను వ్యతిరేకిస్తూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. తమ జీవనాధారం సముద్రమని, దానిని కలుషితం చేస్తే తమ జీవనం ఎలా అని ప్రశ్నించారు. చేపల వేట తప్ప, మరే వృత్తి తమకు రాదని, చేపలు వేట చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. ఇప్పటికే హేటిరో డ్రగ్స్ కంపెనీ వ్యర్థ రసాయన జలాలు సముద్రంలో వదలడంతో మత్స్య సంపద నశించిపోతుందన్నారు. కంపెనీ కాలుష్యంతో అనేక ప్రాణాంతకమైన వ్యాధుల బారిన పడి ఇబ్బందులు పడుతున్నామని, ఇప్పటికే పలువురు మృత్యువాత పడడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీ రసాయన జలాలు ఉప్పుటేరులో కలవడంతో ఇప్పటికే అనేకసార్లు చేపలు మృత్యువాత పడ్డాయని, అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ ఎటువంటి న్యాయం జరగలేదని వాపోయారు. తమ ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించాలని, తమ అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని బల్క్ డ్రగ్‌ను రద్దు చేయాలని కోరారు. బల్క్ డ్రగ్ రద్దు చేసే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు మైలపల్లి మహేష్ బాబు, పిక్కి తాతీలు, నానాజీ, సోమేష్, జి స్వామి, రామ్‌చరణ్, వెంకటేష్, కాశి, మాధవరావు పాల్గొన్నారు.

రైవాడ కాలువపై బ్రిడ్జి పునర్నిర్మించాలి

లేకుంటే జివిఎంసి ఎదుట ఆందోళన చేస్తాం : సిపిఎం

ప్రజాశక్తి-దేవరాపల్లి : కొత్తవలస- దేవరాపల్లి మార్గంలో కృష్ణరాయుడుపేట వద్ద రైవాడ కాలువపై ఉన్న బ్రిడ్జి కుంగిపోయిన నెలలు గడుస్తున్నాయని, దానిని వెంటనే పునర్నిర్మించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న డిమాండ్ చేశారు. బ్రిడ్జి కుంగిపోవడంతో సుమారు నాలుగు నెలలుగా ఈ మార్గంలో దేవరాపల్లిలో బస్సులు రావడం లేదని పేర్కొన్నారు. వెంటనే బ్రిడ్జి పునర్నిర్మాణం చేసి సమస్యను పరిష్కరించకపోతే జివిఎంసి ప్రధాన కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ బ్రిడ్జి కుంగిపోయిన కారణంగా బస్సులు కాలువ దగ్గరే ఆగిపోవడంతో దేవరాపల్లి నుండి వయా కొత్తవలస మీదుగా విశాఖపట్నం వెళ్లే ప్రయాణికులు, రోజు వారి పనులపై కొత్తవలస విశాఖపట్టణం వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆనందపురం నుండి బ్రిడ్జి వరకు రానుపోను ఆటో ఖర్చులు ఒక్కొక్కరికి రూ.60 అవుతున్నాయని, ఈ ఖర్చులు రోజు స్కూల్‌కు వెళ్ళే విద్యార్థుల తల్లి దండ్రులకు పెను భారంగా అవుతున్నాయని పేర్కొన్నారు. దీనికి తోడు వాల్తేరు డిపోకు చెందిన హెయిర్ బస్సు డ్రైవర్లు సమ్మె చేయడంతో ఉన్న బస్సులు కూడా రాకపోవడంతో ప్రయాణికులు, విద్యార్థుల పరిస్థితి దారుణంగా ఉందని పేర్కొన్నారు. ఇప్పటికే అనేక సార్లు ప్రజా సంఘాలు ఆందోళన పలితంగా రూ.91 లక్షలతో జివిఎంసి అధికారులు టెండర్ పిలవడం జరిందని, కాని బిల్లులు చెల్లింపు జరగవని భయంతో కాంట్రాక్టర్లు ఎవరూ నెల రోజులుగా పనులు చేయడానికి ముందుకు రావడం లేదని తెలిపారు. ప్రజల కష్టాలను దృష్టిలో పెట్టుకొని కాంట్రాక్టురు తాత్సారం చేయకుండా వెంటనే పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని, లేకుంటే జివిఎంసి కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని వెంకన్న హెచ్చరించారు.

10 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : గంజాయిను కలిగి ఉన్న ముగ్గురు నిందితులను పట్టుకున్నట్లు సిఐ ప్రేమ్ కుమార్ తెలిపారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన శంకర్, అరవిందన్ 10.5 కేజీల గంజాయిని కొని బ్యాగ్లలో తమ రాష్ట్రానికి తీసుకెళుతున్నట్లు గుర్తించామన్నారు. అనకాపల్లి బెల్లం మార్కెట్ ఎదురుగా పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వారి నుండి రెండు సెల్ ఫోన్లు, 1050 రూపాయలను సీజ్ చేశామన్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. ఎస్సై సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సిఐ ప్రేమ్‌కుమార్